
మంటల్లో కాలిపోయిన ఫైళ్లు

- సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పంటించాక
- 11 మండలాల్లో రెవెన్యూ రికార్డులు సీజ్
- జిల్లా కేంద్రానికి తరలింపు..
- మంటల్లో కాలిన ఫైళ్లపై ఆరా..?

చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్నట్లు..



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అంటే.. ఏంటో తెలుసా?. అచ్చం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి అక్రమార్కులు దర్జాగా నిప్పు పెట్టి.. తాము చేసిన పాపాల రికార్డులను కాల్చేసిన తర్వాత.. ఇప్పుడు జిల్లా అధికార యంత్రాంగం చేస్తున్న హడావుడి ఇది. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో వైసీపీ నాయకులు వందల కోట్ల విలువ చేసే భూములను ఆక్రమించారని, కొందరి భూములు కాజేశారని, డీకేటీ భూములకు అక్రమంగా ఎన్‌వోసీలు తెచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం అనేక భూఆక్రమాలకు పాల్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఆర్డీవోలుగా పనిచేసిన వారి సహకారంతో లెక్కలేనన్ని అరాచకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అక్రమాలు వెలుగులోకి వస్తాయనే ఆందోళన పెద్దిరెడ్డి బినామీలు, అనుచరుల్లో ఉంది. దీనికి తోడు సబ్‌కలెక్టర్‌గా ఆర్డీవోకు బదులుగా ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్‌ను నియమించింది. దీంతో తాము చేసిన పాపాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు అక్రమార్కులు ఏదైనా అఘాయిత్యానికైనా పాల్పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 45 రోజులు దాటుతున్నా జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చాలామంది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భక్తులే ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందిన వాళ్లూ ఉన్నారు. అయితే అటు తెలుగుదేశం పార్టీ నాయకులు కానీ.. ఇటు అధికార యంత్రాంగం కానీ ఈ విషయమై ఆలోచించలేదు ఫలితమే ఆదివారం రాత్రి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి దర్జాగా నిప్పుపెట్టి.. ఆపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కథ అల్లడం.. తీరా జరగరాని సంఘటన జరగడం.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పరువుపోయిన తర్వాత ఇప్పుడు హడావుడి చేస్తోంది.

11 మండలాల్లో రికార్డులు సీజ్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాలిపోయి బూడిదగా మారాయి. 22ఏ సెక్షన్‌లో తొలుత ఈ మంటలు వ్యాపించాయి. దీంతో 22ఏ ఫైళ్లలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలు బయటకు పొక్కకుండా ఉండేందుకే సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిప్పు పెట్టారని ప్రాథమికంగా నిర్ధారణకు అధికారులు వచ్చారు. దీంతో 22ఏ ఫైళ్లు ఏ మండలం నుంచి ఎన్ని వచ్చాయి? ఎవరికి సంబంధించినవి? కాలిపోయిన వాటిలో ఇవి ఉన్నాయా? అని ఆరా తీసే పనిలో అధికారులు పడ్డారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో ఆర్డీవో స్థాయి అధికారులతో రికార్డులను పరిశీలించారు. ఐదు సంవత్సరాల కాలంలో 22ఏ ఫైళ్లు ఎన్ని వెళ్లాయో ఆరా తీశారు. అందులో ఎన్ని పూర్తి అయ్యాయి..? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి..? పరిశీలించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యెం, మదనపల్లె నియోజకవర్గంలో రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గంలో కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా రికార్డులు ఏమాత్రం భద్రంగా ఉన్నాయో పరిశీలించారు. వాల్మీకిపురం మండలంలో హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రికార్డుల పరిశీలన జరిగింది. ఇక్కడి రికార్డులను పరిశీలించి మొత్తం రికార్డులను మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. ములకలచెరువు మండలంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ తదితరులు 22ఏ, ఆర్ఓఆర్ ఫైళ్లను పరిశీలించారు. తమ వెంట సుమారు 40 ఫైళ్లను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. నిమ్మనపల్లె మండలంలో రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించారు. 196 రికార్డులను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. తంబళ్లపల్లె మండలంలో సోమవారం రాత్రి మూడు గంటల వరకు అధికారులు రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నుంచి రికార్డులను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. కురబలకోట మండలంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో 22ఏ ఫైళ్లు ఐదింటికి ఎన్‌వోసీ ఇచ్చారు. ఇంకా ఎనిమిది పెండింగ్‌లో ఉన్నాయి. పెద్దమండ్యెం మండలంలో సోమవారం తెల్లవారుజాము 4 వరకు రికార్డులను పరిశీలించి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. బి.కొత్తకోట మండలంలో సోమశిల డిప్యూటీ కలెక్టర్ లీలారాణి ఆధ్వర్యంలో 22ఏ, ల్యాండ్ కన్వర్షన్ ఫైళ్లను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాలిపోయిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఓసి కాపీలను మరో కాపీ సిద్ధం చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎటువంటి రికార్డులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి అధికారులు తీసుకెళ్లలేదు. రామసముద్రం మండలంలో మదనపల్లె డిప్యూటీ కలెక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. 2022 నుంచి ఇప్పటి వరకు మండలం నుంచి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపిన ఫైళ్లను తనిఖీ చేశారు. ఇందులో ఆర్‌టీపీ, అసైన్‌మెంట్, 22ఏ, కోర్టు కేసులు, ఇంటి స్థలాలు, లోకాయుక్త, వెబ్‌ల్యాండు, మ్యుటేషన్ వంటి ఫైళ్లను పరిశీలించారు. కలికిరి మండలంలో హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్రతో పాటు పీలేరు తహసీల్దార్ మహబూబ్‌బాష, గాలివీడు తహసీల్దార్ శ్రీనివాసులు బృందం రాత్రంతా 22ఏ ప్రతిపాదనలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. కలికిరి నుంచి 37 ఫైళ్లు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. ఇందులో 22ఏతో పాటు.. పెట్రోలు బంకుల క్లియరెన్స్, కన్వర్షన్ ఫైళ్లు ఉన్నాయి. ఈ ఫైళ్లు అన్నింటినీ పరిశీలిస్తే.. ఎందుకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిప్పు పెట్టారో..? క్లూ దొరికే అవకాశం ఉంది. రికార్డులు, ఫైళ్లను కాల్చేసేంత తప్పు ఏం చేశారో? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. విలువైన రికార్డులను భద్రంగా ఉంచాలని కోరుతున్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను కాల్చివేయడాన్ని ఒక సంఘటనగా కాకుండా.. ఒక గుణపాఠంగా చూడాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


వాల్మీకిపురంలో సోమవారం అర్ధరాత్రి రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పాపాల్లో పాలుపంచుకున్నారు..!

- సూత్రధారులు అధికారులే..
- పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డి పాత్రధారుడు


రైస్‌మిల్లు మాధవరెడ్డి (ఫైల్‌ఫొటో)

మదనపల్లె, జూలై 23: మదనపల్లెతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములను పెద్దలకు కట్టబెట్టడంలో రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషించారు. ఇందులో వీఆర్వో నుంచి పై స్థాయి అధికారుల వరకూ బాధ్యులుగానే చెప్పాలి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీగా చెబుతున్న వి.మాధవరెడ్డి పాత్రదారుడైతే..వీఆర్వో నుంచి ఉన్నతాధికారుల వరకూ ఇందులో సూత్రదారుల పాత్ర పోషించారు. 20 ఏళ్లకు ముందు జారీ చేసిన అసైన్డ్ భూములు అమ్ముకునేందుకు హక్కు కల్పిస్తున్నట్లు గత వైసీపీ ప్రభుత్వ పెద్దలకు ముందస్తు సమాచారం ఉండేది. దీంతో పెద్దల అనుయాయులు, తమకు అనుకూలమైన రియల్టర్లు పట్టణం చుట్టూ ఉన్న బికె.పల్లె, కోళ్లబైలు, పొన్నేటిపాళెం, బసినికొండ, వెంకటప్పకోట, వలసపల్లె రెవెన్యూ గ్రామాల్లో డీకేటీ, అసైన్‌మెంటు భూములను జల్లెడ పట్టారు. బాధితులకు చిల్లర డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్లతో రిజర్వ్ చేసుకున్నారు. పెద్దిరెడ్డి అనుయాయుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి, ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలసి ఏరియాలనే కాదు..ఈ భూములను పంచుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు..ఉన్నతాధికారులైన ఆర్డీవో, జేసీ, కలెక్టర్ నుంచి తహసీల్దార్లకు చెప్పించి పని కానిచ్చేశారు. గతంలో జారీ చేసిన అసైన్డ్ భూములను గతంలోనే వివిధ కారణాలతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వీటిని రికార్డుల్లో ఇంప్లిమింటేషన్ చేసినా..ఆన్‌లైన్‌లో అసలైన లబ్ధిదారుడినే చూపిస్తోంది. అలాంటి వాటి ఫైళ్లను కనపడకుండా చేసి, తిరిగీ ఆ భూమిని అదే రైతు లేదా యజమాని పేరున రీస్టోర్ చేసినట్లు ఫైల్ బిల్డప్ చేశారు. దానికి తిరిగీ అన్ని రికార్డులు సృష్టించి ఆ ఫైల్‌ను కలెక్టర్‌కు పంపి రోజుల వ్యవధిలో ఎన్‌వోసీలు పొందారు. అనంతరం దానిని బేసిక్‌గా చేసుకున్న సబ్ రిజిస్ట్రార్ అధికారులు..పెద్దలు, వారి అనుయాయుల పేరున రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత లేదా అంతకు ముందుగానే తహసీల్దార్..పెద్దలు సూచించిన వారి పేరున మ్యుటేషన్ (ఆన్‌లైన్ వన్‌బీ) చేశారు. హక్కులు కల్పించారు. ఇలా విలువైన ప్రభుత్వ, ప్రైవేటు, వివాదాస్పద, కోర్టు కేసుల భూములు చేతులు మార్చేశారు.

బి.కె.పల్లె సర్వే నెంబర్లలో 552లోని భూమి చాలా కీలకమైందే కాదు..అత్యంత ఖరీదైనది..అంతే కంటే వందరెట్లు వివాదాస్పదమైంది కూడా. ఆ సర్వే నెంబర్ అంటేనే అందరూ హడలిపోతారు. ఏకంగా సబ్ డివిజన్లనే మార్చేశారు. అందుకే మదనపల్లె రెవెన్యూ కార్యాలయంలో అసలైన రికార్డులన్నీ ఇప్పటికే మాయమైపోయాయి. అలాంటి సర్వే నెంబర్‌లో పెద్దల సహకారంతో వైసీపీ పాలనలో రికార్డులు సృష్టించి రాత్రికి రాత్రే రిపోర్టులు రాయించి ఎన్‌వోసీలు పొందారు. ఇందులో ఆ గ్రామానికి సంబంధం లేని, తమకు కావాల్సిన వీఆర్వోల నుంచి మ్యుటేషన్‌కు రెకమెండ్ చేశారు. ప్రథమంగా కొండామరిపల్లె వీఆర్వో మాధవరెడ్డి సంతకాలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే గతంలో పనిచేసిన తహసీల్దార్లు సి.కె.శ్రీనివాసులు, ఎస్.మహబూబ్‌చాంద్‌లు ఫైలు సిద్ధం చేసి ఆర్డీవో ఎం.ఎస్.మురళికి పంపగా అక్కడి నుంచి కలెక్టరేట్‌కు పోగా, అప్పటి కలెక్టర్ పి.ఎస్.గిరీషా ఎన్‌వోసీ జారీ చేశారు. అనంతరం ఇక్కడి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ పూతలపట్టు రాజు పెద్దల పేరున, వారి అనుయాయుల పేరున రిజిస్ట్రేషన్ చేశారు. విషయం బయటకు పొక్కడంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. సబ్‌డివిజన్లు మార్చి, ఎన్‌వోసీకి పెట్టిన అంశంపై విచారణ జరుగుతుండగా ఎన్నికల ప్రక్రియలో కలెక్టర్ సస్పెండ్ కావడంతో విచారణ ప్రక్రియ మరుగునపడిపోయింది.

కన్వర్షన్ ఫైళ్లపై అధికారుల కసరత్తు

రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియ ముగిసిపోగా, తర్వాత జరగాల్సిన (ల్యాండ్ కన్వర్షన్) భూమార్పిడి క్రతువుకు తెర లేపారు. ఇందులో భాగంగా ముఖ్యమైన వాటిలో బి.కె.పల్లె, వలసపల్లె రెవెన్యూ గ్రామాల్లో ఎనిమిది ఫైళ్లు పెట్టారు. వీటిని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా ప్రస్తుతం అవి తహసీల్దార్ లాగిన్‌లో ఉన్నాయి. వీటిని పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పనిలో భాగంగానే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరగడానికి ముందు శనివారం, ఆదివారం మాధవరెడ్డి అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇదిలావుండగా, ఓ భూమికి సంబంధించిన ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియలో దరఖాస్తు చేసిన 15 రోజుల్లో ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే దానతంట అదే డీమ్డ్ కన్వర్షన్ అయిపోతుంది. ఇక్కడ ప్రధానంగా చేయాల్సిందల్లా తహసీల్దార్, ఆర్‌డీవోల నుంచి అభ్యంతరం లేకుండా చూడాలి. దీన్ని అభ్యంతరాలతో ఆపాలంటే వీఆర్వో, ఆర్ఐ నుంచి భూమి క్లాసిఫికేషన్, వివాదాలు, తదితర అంశాలపై రిపోర్టు తెప్పించి తహసీల్దార్ తన లాగిన్‌లో అప్‌లోడ్ చేసి ఆపేయాలి. లేకుంటే నిర్ణీత సమయంలో ఆమోదం అవుతుంది. ఈ క్రమంలో ఈ భూముల్లో కీలకపాత్ర పోషిస్తున్న మాదవరెడ్డి శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆర్డీవోతో చర్చించారు. అనంతరం ఆర్డీవో హరిప్రసాద్, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు బి.కె.పల్లె, వలసపల్లె రెవెన్యూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. ఆది నుంచీ పెద్దిరెడ్డి కుటుంబానికి అనుకూలంగా ఉంటూ భూములు కట్టబెట్టడంలో కీలకపాత్ర పోషించిన పూర్వపు ఆర్‌డీవో ఎం.ఎస్.మురళి శనివారం, ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. అక్కడి సెక్షన్ అధికారులతో పాటు ఆర్డీవో హరిప్రసాద్‌తో సమావేశమై చర్చించారు.

ఫైళ్ల జాబితా ఇదీ..!

బి.కె.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-544-3, 552-7, వలసపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-558-9, 558-1, 558-911, 732-1బి, 732-3బీలలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలత పేరున ఈ భూములు ఉన్నాయి. ఈ భూముల ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి ఈనెల 11, 12 తేదీలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. అలాగే అదే వలసపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-546-1లోని భూమికి సంబంధించి వి.మాధవరెడ్డి కుమారుడు మోనీష్‌కుమార్ పేరున ఈనెల ఒకటో తేదీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పెద్దిరెడ్డి సతీమణి భూములకు సంబంధించిన కన్వర్షన్ ఫైలు గడువు ఈనెల 25, 26వ తేదీలతో ముగియనుంది. ఈ మధ్యలో తహసీల్దార్, వాటికి సంబంధించిన అబ్జక్షన్ చెప్పకపోతే డీమ్డ్ కన్వర్షన్ పూర్తి కానుంది. వీటిని ఏం చేయాలో, ఎలా చేయాలన్న దానిపై చర్చించే క్రమంలో గత ఆర్డీవో మురళి కార్యాలయానికి వచ్చి ఆర్డీవో హరిప్రసాద్‌తో చర్చించినట్లు తెలిసింది.

మదనపల్లెలోనే అధికారుల మకాం

- మిస్టరీ మంటలపై పోలీసుల విచారణ
- సీఐడీ అదుపులో గౌతమ్‌తేజ్, మరో ఉద్యోగి
- కాలిన పత్రాలు కట్టలు.. సీజ్, పంచనామా
- పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డి ఇంట్లో సోదాలు
- ఆర్డీవోలతో పాటు ఉద్యోగులనూ విచారించిన బృందం


సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్

మదనపల్లె, జూలై 23: మదనపల్లెలో జరిగిన మిస్టరీ మంటలపై రెండోరోజు మంగళవారం కూడా విచారణ కొనసాగింది. సీఐడీ, పోలీసు, ట్రాన్స్‌కో విభాగాల అధిపతులు మదనపల్లెలోనే మకాం వేశారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌తో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీ, వైసీపీ నాయకుడు వి.మాధవరెడ్డిని విచారించారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులను విడతల వారీగా సీఐడీ, సివిల్ పోలీసులు విచారిస్తున్నారు. అలాగే కార్యాలయంలో అగ్నికి ఆహుతైన కీలకమైన రెవెన్యూ రికార్డులను పరిశీలించిన పోలీసు, సీఐడీ అధికారులు..పాక్షికంగా కాలిన ఫైళ్లను సేకరించి కట్టలు కడుతున్నారు. ఈ ఫైళ్లు ఏ మండలం, ఏ అంశానికి సంబంధించినవో ఆర్‌వోసీ నెంబర్‌తో సహా నమోదు చేసి వీఆర్వోల సమక్షంలో పంచనామా నిర్వహించారు. అలాగే ఆర్డీవోలు ఎం.ఎస్.మురళి, హరిప్రసాద్‌లను తమ అదుపులోనే ఉంచుకున్న పోలీసు, సీఐడీలు విడతల వారీగా విచారించి అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. మరోవైపు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉదయం నుంచి ఇక్కడే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. అలాగే చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఇదీ రెండోరోజు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అదే వేడి, అదే హడావుడి కనిపించింది.

అగ్నికీలల్లో ఆహుతైన కీలకమైన విభాగాన్ని చూసే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, ఆయన సహచర ఉద్యోగి భరత్‌ను సీఐడీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకూ విచారించారు. ఆదివారం రాత్రి గౌతమ్‌తేజ్‌తో పాటు భరత్ కూడా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్లు సమాచారం రావడంతో విచారించినట్లు చెబుతున్నారు. మరోవైపు వీరిద్దరూ కూడా ఒకే రూమ్‌లో ఉంటూ విధులకు హాజరవుతుండటం కూడా సీఐడీ విచారణకు దారి తీసింది. అలాగే ఆర్డీవో ఎం.ఎస్.మురళి రెండు రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఆయనను కూడా అటు పోలీసులు, ఇటు సీఐడీ పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే ఆర్డీవో హరిప్రసాద్‌ను కూడా విచారిస్తున్నారు. పెద్దిరెడ్డి అనుచరుడిగా చెబుతున్న రైస్‌మిల్లు మాధవరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా స్థానిక రెడ్డీస్ కాలనీలోని ఆయన నివాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోలీసులు వీఆర్వోలు, వీఆర్ఏలతో కలసి సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కీలకమైన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రెండు సంచుల మేర ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. డాక్యుమెంట్లు, రికార్డులను నమోదు చేసి వీఆర్వోల చేత పంచనామా చేయించారు. మాధవరెడ్డి అందుబాటులో లేకపోవడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగుల విచారణ

కార్యాలయంలో పనిచేసే అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సీఐడీ, పోలీసులు మంగళవారం విచారించారు. ఇద్దరు ముగ్గురిని బృందంగా ఏర్పాటు చేసి కార్యాలయంతో పాటు డీఎస్పీ, తాలూకా స్టేషన్‌కు తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు టీమ్‌లుగా విచారించారు. ఈ క్రమంలో తాలూకా పోలీస్‌స్టేషన్, డీఎస్పీ బంగ్లాలో ఉద్యోగులు నిరీక్షించారు. అలాగే మదనపల్లె మండలంలోని వీఆర్వోలను టీమ్‌లుగా ఏర్పాటు చేసి కార్యాలయంలో పాక్షికంగా కాలిన రెవెన్యూ రికార్డులు, డాక్యుమెంట్లు, రికార్డులు, కంప్యూటర్లను కట్టలుగా కట్టి సీజ్ చేశారు. విభాగాల వారీగా వేరు చేసి, ఆ ఫైలు ఏ మండలం నుంచి వచ్చిందో ఏ అంశానికి సంబంధించిదో తెలిపేలా ఆర్‌వోసీ నెంబర్ నమోదు చేసి పంచనామా చేశారు.

పరిశీలించిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌ను రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా పరిశీలించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలసి అగ్నిప్రమాదం జరిగిన భవనాలతో పాటు, సబ్ కలెక్టర్ ఆవరణంలోని అన్ని ప్రాంతాలను తనిఖీ చేశారు. 22-ఏ విభాగంలో కాలిపోయి మిగిలిన ఫైళ్లను పరిశీలించారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ప్రమాదానికి గల కారణాలను త్వరగా గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాద ఘటనపై కొత్త సబ్ కలెక్టర్ ఆరా

కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అన్నమయ్య కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో పాటు చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సునీత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇక్కడే ఉన్నారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐలు ఉన్నారు.

పోలీసుల అదుపులో సీసీ మణి

సబ్‌కలెక్టర్ కార్యాలయ క్యాంపు క్లర్క్(సీసీ) మణి, ఎలక్షన్ విభాగం చూసే అస్లాంబాషాను కూడా డీఎస్పీ తాలూకా స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఔట్‌సోర్సింగ్ విభాగం నుంచి వచ్చిన మణి కంప్యూటర్ విభాగానికి ఇన్‌ఛార్జిగా ఉన్నాడు. అయితే కొన్నేళ్లుగా సబ్‌కలెక్టర్, ఆర్డీవోలకు సీసీగా కొనసాగుతున్నాడు. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం పుంగనూరుకు చెందిన వ్యక్తి కావడంతో పాటు కొన్నేళ్లుగా సీసీగా ఉండటం పైగా కాలిపోయిన కంప్యూటర్ సెక్షన్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ కోణంలోనూ మణిని సీఐడీతో పాటు పోలీసులు విచారణ చేస్తున్నారు.


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్


కార్యాలయం ఆవరణలో ఆర్డీవో హరిప్రసాద్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

ఎలక్షన్ ఫైళ్లూ అగ్నికి ఆహుతి

రెవెన్యూ విభాగంలోని 22ఏ, ఎస్‌వోసీ, ఆర్‌వోఆర్ ఫైళ్లతో పాటు ఎలక్షన్ విభాగానికి సంబంధించిన ఫైళ్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ విభాగానికి ఆనుకుని ఉండటంతో ఎలక్షన్లకు సంబంధించిన లెక్కాపక్కా రికార్డులన్నీ బూడిదైనట్లు చెబుతున్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు సంబంధించిన ఎన్నికల జమా, ఖర్చులు ఇందులో ఉన్నాయి. అలాగే ప్రభుత్వం నుంచి విడతల వారీగా ఎంత డబ్బులు వచ్చింది..ఇంకా ఎంత రావాల్సి వుంది..ఇప్పుడు వచ్చిన డబ్బులు ఎవరెవరు ఏయే విభాగాల ఉద్యోగులకు ఇచ్చారనే వివరాలు ఉన్నట్లు తెలిసింది. మరోవైపు ప్రభుత్వం నుంచి మూడు విడతలుగా రూ.1.70 కోట్లు రాగా, మరో రూ.2 కోట్లు రావాలని బిల్లులు సిద్ధం చేశారు. మొత్తం మూడు పద్దుల కింద ఎంతెంత రావాలో నమోదు చేశారు. అలాగే ఎవరెవరికి ఎంత బకాయి ఉందో, తదితర వివరాలు ఈ విభాగంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఎన్నికల విధుల సొమ్ములు ఇవ్వలేదని, టీఏ, డీఏ ఇవ్వలేదని ఉద్యోగులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రెవెన్యూ రికార్డులతో పాటు ఇవి కూడా కాలిపోవడంతో ఆ విభాగాన్ని చూస్తున్న అస్లాంబాషాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'కారుణ్యం' చూపని గౌతమ్‌తేజ్

- కెరీరంతా అవినీతిమయమే

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో 22(ఏ) సెక్షన్‌లో రికార్డులను ఉద్దేశపూర్వకంగా కాల్చారని ఉన్నతాధికారులు నిర్ధారించిన ఘటనలో నిందితుడైన గౌతమ్‌తేజ్ కెరీరంతా అవినీతిమయమే. ఆ సెక్షన్ క్లర్కు (సీనియర్ అసిస్టెంట్) అయిన ఇతడు 'కారుణ్య' నియామకం ద్వారా చిత్తూరు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఇతడి కెరీర్ అవినీతిమయమేనని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డబ్బులిస్తే ఏ పనైనా చేస్తాడని అంటున్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన ఇతడు ఏమాత్రం 'కారుణ్యం' చూపేవాడు కాదంటూ ఐదేళ్ల కిందటి ఘటనను ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేసేటప్పుడు 2019 జూలైలో సుమారు 25 మంది అభ్యర్థుల వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశాడు. ఇతడి వసూళ్లపై 2019 జూలైలో 'ఆంధ్రజ్యోతి' చిత్తూరు జిల్లా సంచికలో ప్రధానంగా కథనం కూడా ప్రచురితమైంది. ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాల్చిన 22(ఏ) సెక్షన్‌కు సంబంధించి గౌతమ్‌తేజ్ క్లర్కుగా పనిచేస్తున్నాడు.. ఇతడి గత వ్యవహార శైలిని పరిశీలించిన రెవెన్యూ వర్గాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పుష్పం.. పత్రం.. సమర్పయామి

- వైభవంగా పుష్పయాగం
- ముగిసిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 23: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ద్వాదశ రాధనలో భాగంగా 12 రకాల నైవేద్యాలు, వివిధ రకాల పుష్పాలను మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేదిక మీద ప్రత్యేక అలంకరణలో ఆశీనులైన ఉత్సవమూర్తుల వద్దకు తీసుకువచ్చారు. టీటీడీ వేదపారాయణులు, ఆలయ అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సాయిక్రిష్ణ శర్మ, సుమంత్‌శర్మ, పార్థు స్వామి ఆధ్వర్యంలో పుష్పయాగం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, టీటీడీ విజిలెన్స్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌గా మేఘస్వరూప్

- బాధ్యతల స్వీకరణ


కలెక్టర్ శ్రీధర్‌కు మొక్క ఇస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 23: మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా మేఘస్వరూప్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను ప్రభుత్వం ఈనెల 19వ తేదీ బదిలీ చేయగా ఆయన స్థానంలో అనంతపురం నగర కమిషనర్‌గా పనిచేస్తున్న మేఘస్వరూప్‌ను మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. సోమవారం సాయంత్రమే మేఘస్వరూప్ బాధ్యతలు చేపట్టాల్సి ఉండగా సబ్ కలెక్టరేట్‌లో ఆదివారం రాత్రి ఫైళ్లు దహనం కావడంతో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా మదనపల్లె క్యాంపు కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ శ్రీధర్‌ను మేఘస్వరూప్ మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు.

అక్రమ లే అవుట్లపై కొరడా

● అనధికార లేఅవుట్లలో రాళ్ల తొలగింపు ● ప్లాట్లు కొన్నవారిలో భయాందోళన
● ప్రభుత్వ జీవో ప్రకారం అన్నింటిని తొలగిస్తాం.. అధికారుల వెల్లడి

ఎర్రగుంట్ల, జూలై 23: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమలేఅవుట్స్‌పై దృష్టి పెట్టి చర్యలకు ఉపక్రమించింది. నెల్లూరు, కడప జిల్లాలో 2019-2024 మధ్యలో భారీగా అక్రమ లేఅవుట్స్ వేశారన్న ఫిర్యాదులపై చంద్రబాబు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం జీవో విడుదల చేసింది. దీని ప్రకారం రెండు జిల్లాలకు చెందిన అధికారులు వీటిపై చర్యలకు ఉపక్రమించి.. తొలగించే కార్యక్రమం చేపట్టారు.

జిల్లాలో డీటీసీపీ క్రిష్ణసింగ్ ఆధ్వర్యంలో ముందుగా అన్ని మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో వేసిన వాటిపై కొరడా ఝుళిపిస్తున్నారు. అలాగే పల్లెల్లో వేసిన లేఅవుట్స్ కూడా పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఎర్రగుంట్లలో 2019-2024మధ్యలో 12 లేఅవుట్స్ ఉన్న ట్లుగా అధికారులు గుర్తించారు. ప్లాట్లకు నాటిన నెంబర్ రాళ్లను అధికా రులు పోలీసుల పర్యవేక్షణలో తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు 9లేఅవు ట్స్‌లో ఉన్న సుమారు 300లకు పైబడి ప్లాట్లకు సంబంధించిన రాళ్లను తొలగించారు. అనధికారికంగా వేసిన 12లేఅవుట్స్‌లో సుమారు 560 ప్లాట్లు రిజిస్ట్రేన్లు జరిగినట్లు సమాచారం. వీటిలో సుమారు 60 ఇళ్లు నిర్మించారు. అయితే వీటి జోలికి అధికారులు వెళ్లలేదు. ఇందులో కొన్నింటికి అప్రూవల్స్ ఉన్నాయి. కొన్ని కమర్షియల్ కాంప్లెక్స్ కూడా ఉండ టం గమనార్హం. వీటికి అధికారులు 14శాతం ఖాళీ స్థలం విలువ, పీనలైజేషన్ చార్జెస్ (ఏరియా మార్కెట్ విలువను బట్టి), కాంపౌండింగ్ చార్జెస్‌తోపాటు ఇతర ఫీజులను కూడా కట్టించుకుని వాటికి పన్నులు కూడా వేశారు. చాలా వాటికి ఇప్పటికీ అప్రూవల్స్ లేవు, పన్నులు వేయలేదు.


అనధికార లేఅవుట్లలో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించలేదు

ఎర్రగుంట్లలో 2019 నుంచి వేసిన 12 లేఅవుట్స్‌కు ఎవరూ అప్రూవల్స్ తీసుకోలేదు. లేఅవుట్‌కి సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం) ప్రకారం 30అడుగుల దారి వుండాలి. అప్రోచ్‌రోడ్డు 40 అడుగులు ఉండాలి. దాని ప్రకారం ఎవరైనా లే అవుట్ (వెంచర్) వేయాలంటే 14శాతం ఖాళీ స్థలం (పార్కులు, టెంపుల్స్, బడిగాని) వదలాలి. అయితే చాలా లేఅవుట్స్‌లో 30 అడుగుల రస్తా, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారు. కానీ 14శాతం ఖాళీ స్థలాన్ని ప్రభు త్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కేవలం ల్యాండ్ కన్వర్షన్ తీసుకుని ప్లాట్లు వేసి అమ్మారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి లేఅవుట్స్‌లో ప్లాట్లు కొన్న యజమానులు ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. లేఅవుట్స్ వేసిన వారికి ఫోన్లు చేసి ప్రశ్నిస్తున్నారు. వారు సరైన సమాధానం చెప్పలేక ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసుకుంటున్నారు.

ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు

గత ఐదేళ్లుగా కళ్లెదుటే లేఅవుట్స్ వేసి.. ఇళ్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గతంలోనే కఠిన చర్యలు తీసుకుని వుంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులు అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో కేవలం తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. దీంతో విచ్చలవిడిగా లేఅవుట్స్ వేశారనే విమర్శలున్నాయి. కాగా, మంగళవారం కూడా లేఅవుట్స్‌లో రాళ్ల తొలగింపు కార్యక్రమాన్ని డీటీసీపీ క్రిష్ణసింగ్ చేపట్టారు. అనధికార లేఅవుట్స్‌లో ప్లాట్ల హద్దుల రాళ్లను తొలగించడంపై టీడీపీ నాయకులు జమ్మలమడుగు నియోజకవర్గం ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిని కలిశారు. జరుగుతున్న నష్టాన్ని వారు ఆయనకు వివరించారు.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తున్నాం

ప్రభుత్వం ఆదేశాలను అమలు చేస్తున్నాం. అనుమతులు లేని లేఅవుట్లకు గతంలో నోటీసులు ఇచ్చాము. దాని ప్రకారం ప్లాట్ల హద్దులకు ఏర్పాటు చేసిన రాళ్లను తొలగిస్తున్నాం. అయితే ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. వాటిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుం టాము. అన్నింటిని తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేయించుకోవాల్సిందే.

-రామక్రిష్ణయ్య, కమిషనర్, ఎర్రగుంట్ల.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యా బోధన చేయాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జూలై 23: విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యార్థులకు విద్యాబోధన చేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా మొదట గేటు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సందర్శించి అకడమిక్ సంబంధించిన విషయాలను పరిశీలించారు. తర్వాత బాలుర ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ తరగతి గదిని పరిశీలించి విద్యార్థులకు కిట్స్ అందజేస్తామని... పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇస్తామని ఆయన తెలియజేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి అకడమిక్ పరంగా తగు సూచనలు ఇచ్చారు. గుర్రాలమిట్టలో ఉన్న కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి.. విద్యార్థులను ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తర్వాత కేజీబీవీ ఎస్‌వో, సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థినులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయేరియా సీజనల్ జబ్బులకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని ఎస్‌వోకు తెలియజే శారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నాగరాజ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తనిఖీ



పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కడప డీఈవో అనురాధ

సిద్దవటం, జూలై 23: సిద్దవటం జడ్పీ హైస్కూల్ మంగళవారం కడప డీఈవో అనురాధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి.. పాఠశాలలో జరిగే 'శిక్ష సప్తాహ' రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం తదితర విషయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధన సిబ్బందిని ప్రశ్నించారు. విధులకు గైర్హాజరైన సిబ్బంది సెలవు చీటీలను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల పరిసరాల పరిశుభ్రతను, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత మీద ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. పిల్లలకు చదువుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్నా భోజన వంట గదిని, పరిసరాలను పరిశీలించి.. భోజన రుచి చేశారు. టాయిలెట్స్ పరిశీలించి. శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలను తనిఖీ చేసిన వీసీ


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రఘునాధరెడ్డి

కడప (ఎడ్యుకేషన్) జూలై 23: వైవీయూ బాలుర, బాలికల వసతి గృహాలను వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాధరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ పద్మతో కలిసి తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నా భోజన సమయంలో వసతిగృహం సందర్శించి.. విద్యార్థులు తింటున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. వసతి గృహాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేయాలని చెప్పారు. వంటశాల, డైనింగ్ హాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

80 జామచెట్లు అగ్నికి ఆహుతి

చాపాడు, జూలై 23: మండలంలోని పల్లవోలు గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 80 జామచెట్లు కాలిపోయాయి. గ్రామస్థుల సమాచారం మేరకు... పల్లవోలు గ్రామ సమీపంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద 11 కేవీ విద్యుత్తు వైర్లు తెగి.. స్తంభాల మీద పడటంతో నిప్పులు రాలి కింద పడ్డాయి. అక్కడ ఉన్న జామచెట్లు చుట్టూ ఎండిన గడ్డి ఉండడంతో ఆ మంటలు పొలం అంతా అంటుకున్నాయి. దీంతో జామచెట్లు కాలిపోయాయి. గత మూడేళ్ల నుంచి ఈ జామచెట్లు పెంచుకుంటున్నారు. ఈ జామ చెట్లు పక్కనున్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమానికి చెందినవి. ప్రొద్దుటూరులోని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

సుండుపల్లె వాసికి జీవిత ఖైదు


ఆనంద్ (ఫైల్ ఫోటో)

సుండుపల్లె, జూలై 23: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సుండుపల్లె ఎస్‌ఐ ఎస్ కేయం హుస్సేన్ తెలిపారు. వివరాలిలా.. సుండుపల్లె మండలం పెద్దపల్లెకు చెందిన నంద్యాల ఆనంద్ (42) తన భార్య నందాల ధనలక్ష్మిని 2004 సంవత్సరంలో హత్య చేశాడు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం పూర్వపరాలు విచారించి... నిందితుడు ఆనంద్‌కు జీవిత ఖైదు విధిస్తూ రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

చక్రాయపేట, జూలై 23: మండలంలో ఓ మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ కడప జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్ జడ్జి నందిని తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. 2012లో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు కాగా.. అప్పటి పులివెందుల ఎస్‌డీపీఓ శ్రీనివాసులు కేసు విచారణ చేశారు. ప్రస్తుత పులివెందుల ఎస్‌డీపీఓ కేఎస్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితుడిని సంస్కరించడానికి అబ్జర్వేషన్ హోంకు పంపించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మైలవరం, జూలై 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా గుర్తించిన సిబ్బంది ఆమెను రక్షించి పోలీసులకు అప్పగించారు. దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన అంజనమ్మకు ఇద్దరు పిల్లలుండగా, ప్రస్తుతం ఆమె గర్భిణి. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో సహా మైలవరం జలాశయం గేట్ల వైపు వెళుతున్న విషయం గమనించిన లష్కర్లు ఆమెను అడ్డుకున్నారు. ఆమె ద్వారా విషయం తెలుసుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ రెడ్డి సురేష్ బాధితురాలిని విచారణ చేస్తున్నారు.

రైలునుంచి కింద పడి బాలుడికి గాయాలు

వల్లూరు, జూలై 23: వల్లూరు మండలం తప్పెట్ల గ్రామ సమీపంలో డెమో రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి నాలుగేళ్ల బాలుడు హుసేన్‌కు గాయాలైనట్లు కమలాపురం రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. బాలుడి తల్లికి మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రాథమిక సమాచారం. గాయపడ్డ బాలుడిని కమలాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. ప్రథమ చికిత్స నిర్వహించి కడప రిమ్స్‌కు 108 ద్వారా తరలించినట్లు తెలిపారు.

బండారు అరుణాచలం మృతి


బండారు అరుణాచలం (ఫైల్)

కడప (ఎడ్యుకేషన్) జూలై 23: కడప నగరం విద్యామందిర్ పాఠశాల సమీపంలో ఉంటున్న మాజీమంత్రి బండారు రత్నసభాపతి రెండో కుమారుడు బండారు అరుణాచలం (67) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అరుణాచలం భౌతిక కాయాన్ని టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ నేతలతో పాటు వివిధ రాజకీయ నాయకులు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవునికడప రోడ్డు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు.. అతని బావమరిది శ్రీహరి ఐరన్ మార్ట్ అధినేత వడ్ల శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల సహకారంతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

పులివెందుల టౌన్, జూలై 23: ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమని కడప విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. మంగళవారం తొండూరు మండలంలోని మల్లేల సబ్‌స్టేషన్‌తో పాటు పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించారు. అనంతరం తొండూరు, సింహాద్రిపురం మండలాల అధికారులు, సిబ్బందితో తొండూరు విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. లూజు లైన్లను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికశాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. అప్రమత్తతతో ప్రమాదాలు నివారించాలని తెలిపారు. విద్యుత్ పనులు చేసేటపుడు భద్రత నియమాలు పాటించాలని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్‌పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఈఈ శ్రీనివాసులు, డీఈఈ జయసుధాకర్‌రెడ్డి, ఏఈఈ రమేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు చెందిన చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్


దొంగల వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, జూలై 23: పలు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్నాచింగ్ గ్యాంగ్‌ను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన గ్యాంగ్‌కు సంబంధించిన వివరాలను రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు పర్యవేక్షణలో రాయచోటి పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణంలోని కొత్తపేట రోడ్డులో గల హనుమాన్ జంక్షన్ వద్ద భాగ్యలక్ష్మి అనే మహిళ వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌లో వచ్చి మహిళ మెడలో ఉన్న చైన్‌ను లాక్కెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు మంగళవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన హీరన్ చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అయిన యూనస్ హుస్సేన్ రాయత్‌అలీ, హంస యూనస్‌లను అరెస్టు చేసి విచారించగా వారు పుంగనూరు, రాయచోటి పట్టణంలో చైన్ స్నాచింగ్ చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి సుమారు 45 గ్రాముల బంగారు చైన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ బైక్ సీజ్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ కేసులో అరెస్టు అయిన యూనఫ్ హుస్సేన్ రాయత్ అలీ, హంస యూనస్‌లు తమిళనాడు రాష్ట్రం దండిగల్ జిల్లా గాంధీనగర్‌కు చెంది, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పరిధిలోని కలికిరి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారని తెలిపారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

కొండాపురం, జూలై 23: మండలంలోని పెంజి అనంతపురం సబ్‌స్టేషన్ వద్ద మూడు రోజుల కిందట సెంట్రింగ్ రేకుల చోరీ కేసులో మంగళవారం పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. కొండాపురం పట్టణానికి చెందిన ముగ్గురిని గండ్లూరు, చౌటిపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు. నేషనల్ హైవే పనులకు సంబంధించిన సుమారు రూ.1,20,000 విలువ చేసే సెంట్రింగ్ రేకులను వారి నుంచి రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళ్లపాకలో వేడుకగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్త బృందాలు

రాజంపేటటౌన్, జూలై 23: అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో జరుగుతున్న సిద్దేశ్వరస్వామి, చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఎంతో శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగుతూ తాళ్లపాక మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గోవిందనామస్మరణలు, భజన బృందాల కోలాటాల నడుమ ఆద్యంతం కన్నుల పండువగా సాగిన ఈ కార్యక్రమాలను భక్తులు ఆనందోత్సాహాలతో తిలకించారు. కాగా రథం చక్రం ఒకటి విరగడంతో కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయాల సమూహ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామియాదవ్, వినోద్‌కుమార్, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానంల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ గోపీబాబు, ఆర్.స్వామినాయక్, దేవరాజులు, ధర్మచార్యులు గంగనపల్లి వెంకటరమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు బి.మఠం చెరువు మత్స్యసంపద వేలం

కడప(రూరల్) జూలై 23 : బి.మఠం చెరువులో 2024 జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు చేపలు పట్టుకుని, అమ్ముకునేందుకు ఈ నెల 25న గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు బి.మఠం మత్స్య క్షేత్రం అభివృద్ధి అధికారి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10-30 గంటల నుంచి 1-00 గంట వరకు బహిరంగ వేలం ఉంటుందని.. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు రూ.500 సైకం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

బోగస్ ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో భూమి రిజిస్ట్రేషన్

● చర్యలు తీసుకోవాలని బాధితురాలి విజప్తి

చెన్నూరు, జూలై 23 : కడప తహసీల్దారు కార్యాలయంలో తప్పుడు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ పొంది.. విలువైన ఎకరా 29 సెంట్లు భూమిని తన భార్య పేరున ఓ వ్యక్తి రిజిస్టరు చేయించుకున్నాడు. దీంతో బాధితురాలు, అతని పినతల్లి కలెక్టరుతో పాటు ఆర్డీవోకు వినతి పత్రాలు సమర్పించి రద్దు చేయాలని కోరారు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరుకు చెందిన సగిలి పార్వతి కడప నగరం చిన్నచౌకు ఏరియాలోని కొండాయపల్లెలో చాలా ఏళ్లుగా నివశిస్తోంది. ఆమె భర్త సగిలి సుబ్బరాయుడు కడప సబ్‌ట్రెజరీ ఆఫీసులో పనిచేస్తూ 2021 మే 27న మృతి చెందాడు. దీంతో అతని తరువాత వారసురాలిగా ఆయనకు వచ్చే పింఛను ఆమెకు వచ్చేటట్లు రికార్డుల్లో పొందుపరచడంతో ఆమెకు పింఛను వస్తోంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. మృతి చెందిన సగిలి సుబ్బరాయుడుకు తన తల్లి నుంచి సంక్రమించిన చెన్నూరు రెవెన్యూ పొలంలో సర్వే నెం.153లో 1.29 ఎకరాలు వ్యవసాయం పొలం ఉంది. పుష్పగిరి వెళ్లే రోడ్డులో ఉన్న ఈ పొలం విలువ కాస్త ఎక్కువే. దీంతో ఆ పొలాన్ని ఎలాగైనా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్నాడు మొదటి భార్య కుమారుడైన సగిలి విజయకుమార్ యాదవ్. అయితే సుబ్బరాయుడుకు చాలా ఏళ్ల క్రితం ప్రొద్దుటూరుకు చెందిన మహిళతో వివాహం కాగా.. ఆమె మగబిడ్డ ప్రసవించిన రోజునే చనిపోయింది. ఆ తరువాత చెన్నూరుకు చెందిన నక్కా శింగరయ్యకుమార్తె పార్వతిని వివాహం చేసుకున్నాడు. ఈమెకు ముగ్గురు ఆడపిల్లలు. తల్లి చనిపోయిన బాబును అప్పటి నుంచి పార్వతి పెంచి పెద్ద చేసి వివాహం చేసింది. కాగా సగిలి సుబ్బరాయుడు సబ్ ట్రెజరీ ఆఫీసులో ఉద్యోగం చేసే సమయంలో చిన్నచౌకు ఏరియాలోని కొండాయపల్లెలో ఇల్లు కూడా కట్టుకున్నారు. ఆ ఇంటిని ముందుభాగం తన పెద్ద భార్య కుమారునికి రెండోభాగం ప్రస్తుతం ఉన్న పార్వతికి ఇచ్చారు. కాగా విజయకుమార్ మొత్తం ఇంటిని, భూమిని ఆక్రమించేం దుకు తరచూ పినతల్లితో గొడవలు పడేవాడు. ఈ విషయంలో పలువురు పెద్ద మనుషులు పలుమార్లు పంచాయతీ చేసినా ఫలితం లేకపోయింది. కాగా పార్వతి తన భర్త మొదటి భార్య సంతానమైన విజయకుమార్‌కు ఉన్న ఆస్తిలో సగం ఇవ్వాలని... భర్త చనిపోయిన అనంతరం ఫ్యామలీ మెంబరు సర్టిఫికెట్ కోసం కడప రెవెన్యూ కార్యాలయం చుట్టూ రెండేళ్లు తిరిగినా సర్టిఫికెట్ మంజూరు చేయలేదు. అయితే విజయకుమార్ రెవెన్యూ కార్యాయలంలో ఏం చెప్పాడో, ఎంత ముడుపులు ఇచ్చాడో తెలియదు కానీ సర్టిఫికెట్ మాత్రం 19.7.2021న మంజూరు అయింది. అనంతరం ఆ సర్టిఫికెట్‌తో చెన్నూరులోని ఎకరా 29 సెంట్ల పొలాన్ని కాజేసే ఆలోచనతో 2023లో కడప రిజిస్టరు ఆఫీసులో రూ.8.26 లక్షలకు అతని భార్య కాటుక సింధూరి పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ అయింది. ఆన్‌లైన్ చేయించేందుకు చెన్నూరు రెవెన్యూ కార్యాలయానికి రాగా.. అసలు విషయం బయటపడింది. ఇది తప్పుడు సర్టిఫికెట్ అని తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సగిలి పార్వతికి ఆమె తండ్రి నక్కా సింగరయ్యకు విషయం తెలిపి.. ఆన్‌లైన్ కాకుండా నిలిపివేశారు. ఆ సర్టిఫికెట్ తప్పుడుది అని తెలియడంతో ఇటీవల మూడుమార్లు కలెక్టరు, రెండుమార్లు కడప ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. తప్పుడు సర్టిఫికెట్‌తో ఆస్తిని కాజేయాలని చూసిన సగిలి విజయకుమార్‌యాదవ్‌పై, సర్టిఫికెట్ మంజూరు చేసిన కడప రెవెన్యూ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


తప్పుడు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ చూపుతున్న సగిలి పార్వతి, ఆమె తండ్రి సింగరయ్య

ప్రాజెక్టు నిర్మాణం ఉందా.. లేదా...?

● అయోమయంలో వీరబల్లి రైతులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 23: ప్రజా ప్రయోజనాల కోసం 1800 మెగావాట్ల స్టీమ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం గతేడాది వీరబల్లి మండలం డి.రాచపల్లిలో దాదాపు 498.62 ఎకరాల భూమి అవసరమని అప్పటి కలెక్టర్ భూసేకరణ చేశారని, ఈ మేరకు పనులు కూడా మొదలు పెట్టారన్నారు. అయితే అది ఇప్పటివరకు కార్యాచరణకు నోచుకోలేదని వీరబల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... తమ గ్రామంలో భూ సేకరణ పూర్తి చేయడంతో పాటు ప్రజలతో మీటింగ్‌లు ఏర్పాటు చేశారని, అధికారికంగా పనులు పూర్తి చేసుకుని అవార్డు పాస్‌చేసే లోపు కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో పనులు ఆగిపోయినట్లు తెలిపారు. అనంతరం వచ్చిన కలెక్టర్‌ను ఈ విషయంపై అడుగగా పరిశీలిస్తానని చెప్పారని వారన్నారు. అప్పటి నుంచి గ్రామంలోని రైతులు ఎవరూ పంటలు సాగు చేయాలో లేదో అని అయోమయంలో ఉన్నారని, ప్రాజెక్టు నిర్మాణం ఉందో లేదో చెబితే పంటలు వేసుకుంటామని తెలిపారు. దీనికి తోడు ఒకవేళ నిర్మాణ పనులు జరిగితే తమకు నష్టపరిహారం ఎప్పుడు ఇస్తారో తెలియజేయాలన్నారు. ఈ మేరకు గ్రామంలోని రైతులు డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉమ్మడి కడప జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీలు

రాజంపేటటౌన్, జూలై 23: ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉమ్మడి కడప జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ప్రముఖ హిందీ నవలకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ప్రేమ్‌చంద్‌కు జీవనీ అనే అంశంపై వ్యాసరచన ఉంటుందన్నారు. వివరాలకు 6303701314 నంబరును సంప్రదించాలన్నారు.

పని తక్కువ.. బిల్లులు ఎక్కువ



తుప్పు పట్టిన కడ్డీలతో ఎస్.సోమవరం అంగన్వాడీ భవనం



ఇటుకలు, కడ్డీలు, పిచ్చిమొక్కలతో ఉన్న బావులకాడపల్లి అంగన్వాడీ భవనం

● కాంట్రాక్టర్లపై అధికారుల అత్యుత్సాహం

● పునాది దశలోనే అంగన్వాడీ కేంద్రాలు

సంబేపల్లె, జూలై 23: స్త్రీశిశు సంక్షేమశాఖలో పక్కా భవనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. ఒక్కో భవనం రూ.13.50 లక్షలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులను మంజూరు చేస్తూ గ్రామీణ నీటి పారుదలశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులను చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లపై అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో పని తక్కువ, బిల్లులు ఎక్కువ చేసి భవనాలను పునాది దశలోనే వదిలేసిన సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి.

బావులకాడపల్లి, అగ్రహారం, దేవళంపేట, ఎస్.సోమవరం అంగన్వాడీలకు భవనాలు మంజూరయ్యాయి. ఈ పనులను ఏడాది క్రితం ఇరువురు కాంట్రాక్టర్లు ప్రారంభించారు. ఏడాది గడిచినా పునాది దశలోనే పనులు ఉన్నాయి. పిచ్చిమొక్కలతో పిల్లర్స్ కడ్డీలు తప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. ఈ నాలుగు సెంటర్లకు పునాదులు వేసి అధిక మొత్తంలో బిల్లులు చెల్లించారు. కడ్డీలు, కంకర, లేబర్స్‌కు బిల్లులు మంజూరు చేశారు. అగ్రహారం సెంటర్‌కు రూ.5,46,442, బావులకాడపల్లె సెంటర్‌కు రూ.4,78,642, ఎస్.సోమవరం సెంటర్‌కు రూ.4,39,627, దేవళంపేట సెంటర్‌కు రూ.3,59,549 డబ్బులు చెల్లించినట్లు సమాచారం. త్వరితగతిన పనులు చేసి అప్పగించాల్సిన కాంట్రాక్టర్లు పునాది దశలోనే పనులు ఆపివేయడంతో అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. సంవత్సరం పాటు పనులు పూర్తి చేయకపోవడంతో పిల్లర్స్‌కు నిలిపిన కడ్డీలు తుప్పు పట్టాయి. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి బిల్లులు చేసిన అధికారులపై, కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగరత్నను వివరణ కోరగా అంగన్వాడీ భవనాల పనులు జరిగిన మేరకే బిల్లులు చెల్లించినట్లు తెలియజేశారు.

బడ్జెట్ కేటాయింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు, సంబరాలు నిర్వహిస్తున్న కూటమి నాయకులు

రాజంపేటటౌన్, జూలై 23: రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చాణక్యతకు ఇదే నిదర్శమన్నారు. ఈ మేరకు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వరాల జల్లులు కురిపించిందని, దీంతో ఎన్నో ఏళ్లగా కలగా మిగిలిన రాజధాని, పోలవరం పనులు సాకారమవుతాయన్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడమేగాక పూర్తయ్యేవరకు సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రం హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణనాయుడు, సిద్దవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్, రాజంపేట పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ఆర్.సతీష్‌రాజు, సూర్యనారాయణరాజు, తోట శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు సంబరాలు

రాష్ట్రానికి ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కేంద్రం నిధులు భారీగా కేటాయించడం పట్ల నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు. మంగళవారం పాతబస్టాండ్ కూడలిలో రాజంపేట ఎన్డీఏ కూటమి జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున బాణాసంచా పేల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనసేనపార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు, పోతుగుంట రమేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కుమార్, పట్టణ అధ్యక్షుడు సుబ్బనరసయ్య తదితరులు మాట్లాడారు. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్ర అభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంబరాల్లో సంజీవరావు, నేతలు శివరామరాజు, శివప్రసాద్, షబ్బీర్‌అహ్మద్, క్రిష్ణయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై వరాల జల్లు

ఎన్డీఏ కూటమి ఏర్పడిన నూతన ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిపించారని తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృషితో ఎప్పుడూ లేనివిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల నిధులు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు.

సుండుపల్లె: పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయింపు హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు నాగరాజా, జిల్లా యువజన నాయకుడు నాగలేసు, ఎంఆర్‌పీఎస్ నాయకులు వీరనాగయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కేసులు నమోదు

● మున్సిపల్ కమిషనర్ రాంబాబు

రాజంపేటటౌన్, జూలై 23: రాజంపేట మున్సిపాలిటి పరిధిలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వాడకానికి స్వస్తి పలకాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాంబాబు వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలను స్వయంగా కమిషనర్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయించారు. ఈ దాడుల్లో పలు దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. ప్లాస్టిక్ వాడడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ దాడుల్లో డీఈ ఈశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మల్లేశుడు, వార్డు శానిటేషన్ పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.



దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి

● గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

సిద్దవటం, జూలై 23: మండలంలోని మాధవరంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎక్కడా ఎలాంటి గొడవలు జరగకుండా ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఎస్ఐ పెద్ద ఓబన్న మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు, నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



కమిటీ మెంబర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Shaik Darbar** S/o Shaik Reddy Basha Door No. 11-135, Mohammed Pura Street, Rayachoty Town, Post, Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within five days from the date of this notice. Otherwise matter objections will not bind on my clients in the regard.

SCHEDULE OF PROPERTY :- Annamayya District erstwhile Y.S.R. Kadapa District, Rayachoty Sub. Reg. Dist., Rayachoty Municipality at Rayachoty Village Polam in Sy.No. 759/2 an extent of 233. square yards out of Ac. 2.10 cents is **Bounded by:** East- Site retained by Shaik Mustak Ahammad, West - 12 feets width Rasta, North - House of Shaik Jaheeruddin D.No. 18/122-1-4 and house of Shaik Reddy basha, D.No. 18/122-1-2, ,South-8 Feet width rastha. Measuring: East - West 60 feets, North - South = 35 feets. Within these boundaries the above said property is situated with all easement rights.

C. SUNIL KUMAR REDDY, B.A., B.L.,
ADVOCATE, Rayachoty, 9441738746

కుట్ర వెనుక మాజీ మంత్రి హస్తం : బీజేపీ

రాజంపేటటౌన్, జూలై 23: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం దహనం వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి అనుచరుల హస్తం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 900 ఎకరాలకు సంబంధించిన భూమి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు, వారి అనుచరులకు దారాదత్తం చేయడంలో ఆర్డీవో, గతంలో పనిచేసిన సబ్‌కలెక్టర్ హస్తం ఉందని ఆరోపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త కలెక్టర్లను నియమించడంతో తమ బండారం బయట పడుతుందని ఈ దారుణానికి పాల్పడ్డారని విమర్శించారు. కార్యాలయానికి సెలవు దినం అయినా సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ ఎందుకు రాత్రి 11 గంటల వరకు కార్యాలయంలో ఉన్నారని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎక్కడా జరగకుండా సీఎం చంద్రబాబు బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వీవీ రమణ, జీకే నాగరాజు, టి.హరిప్రసాద్, పి.సూర్యచంద్ర, రమణ, తోట నగేష్, చెన్నయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

ప్రభుత్వ కార్యాలయాలపై నిఘా

●తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పరిశీలన

సుండుపల్లె, జూలై 23: సుండుపల్లెలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మంగళవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ పరిశీలించారు. రికార్డులు ఉన్న గదులు భద్రంగా ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కిటికీలు సరిగ్గా లేకపోవడంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసులు రాత్రి సమయంలో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేసేన్, సబ్ రిజిస్ట్రార్ ప్రకాశ్, సూపరింటెండెంట్ ఈశ్వరయ్య, పోలీసులు పాల్గొన్నారు.

బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు

వీరబల్లి, జూలై 23: జీవనోపాధులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తామని ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సభ్యులు ఆసక్తి గల జీవనోపాధులకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. యూనిట్ విలువను బట్టి రుణం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుభద్రమ్మ, కుళ్లాయప్ప, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

చిన్నమండెం, జూలై 23: మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని రెడ్డిసాబ్ తోటలోని చెక్‌డ్యాం దగ్గర పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,060ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ

ఓబులవారిపల్లె, జూలై 23: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతికారెడ్డి జాతీయస్థాయి ప్రేరణ కార్యక్రమంలో మెరుగైన ప్రతిభ కనబరచడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సి.గీతికారెడ్డి ఆకేపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ప్రేరణ ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అత్యున్నత ప్రతిభ కనబరచిందని తెలిపారు.

అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టాలి : టీడీపీ

రాజంపేట, జూలై 23: మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగి ఉందని, దీనిపై హైకోర్టు మాజీ జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా విచారణ జరిపించాలని దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆర్డీవో కార్యాలయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం లేదన్నారు. లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వారి అనుయాయులు చేసిన భూ అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు అగ్ని ప్రమాదాన్ని సృష్టించారని ఆరోపించారు. రాజంపేట నియోజకవర్గంలో సైతం వేల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయని, నియోజకవర్గంలోని వైసీపీ బడా నేత ఎన్నికల ముందు 50 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపణలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెవెన్యూ కార్యాలయాలకు ప్రత్యేక భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆదిశేషారెడ్డి, ఎంపీటీసీ పెంచలయ్య, ధనుంజయ్యనాయుడు, మహిళా నాయకురాలు రాణి, మండే నాగరాజు, చుక్కా కొండయ్య, సాతపల్లె వెంకీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా కోర్టు రాయచోటిలో
O.S. No. 2/2024

1) షేక్ షఫి అహమ్మద్ చనిపోయినందున ఇతని వారసులు - 2) షేక్ అబిదఖానం W/o లేట్ షేక్ షఫి అహమ్మద్, 3) షేక్ షిరాజ్ అహమ్మద్ S/o లేట్ షేక్ షఫి అహమ్మద్, 4) షేక్ రయిస్ ఫాతిమా D/o లేట్ షేక్ షఫి అహమ్మద్, 5) షేక్ నఫీస్ ఫాతిమా D/o లేట్ షేక్ షఫి అహమ్మద్, డి.నెం. 33-111 -బి, Opp. అజీమ్ బంగ్లా, రాయచోటి టౌన్ ప్రస్తుతం డి.నెం. 6-1-ఎ-10, దేవాలన్స్ వీధి, మాలిక్ ఫంక్షన్ హాల్ దగ్గర, మదనపల్లి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా - వాదులు

V/s

సయ్యద్ అసద్ అహమ్మద్ S/o సయ్యద్ మహమ్మద్, 44 సం., వ్యాపారం వలన జీవనం సాకిన్ డి.నెం. 22/54, మహమ్మద్ పుర వీధి, కొత్తపల్లి, రాయచోటి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా. - 3వ ప్రతివాది

దావా సమను

పై నెంబర్ యొక్క దావాలో 2 నుంచి 5 వాదులు మీపైన ఇంకా కొంతమందిపైన పర్మినెంట్ ఇంజక్షన్ దావాలో మీరు కోర్టుకు 14-8-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని పై కోర్టులో హాజరై నీ యొక్క ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున తీర్మానము చేయు దురని తెలియజేయడమైనది.

By Order of the Court
ఎస్.ఎం.డి. తహీర్, B.A., B.L.
వాది తరపున న్యాయవాది, రాయచోటి

సనిశెట్టి నారాయణ మృతి

రాజంపేటటౌన్, జూలై 23: రాజంపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సనిశెట్టి నారాయణ(82) మంగళవారం ఉదయం మృతి చెందారు. 2003 నుంచి 2018 వరకు నారాయణ క్లాత్‌మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. వస్త్ర వ్యాపారుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు. అసోసియేషన్ సభ్యుల సహకారంతో క్లాత్‌మర్చంట్ అసోసియేషన్‌కు సొంత భవనాన్ని నిర్మించారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి వాసవి అమ్మవారికి వెండిరథం నిర్మాణంలో ముఖ్యభూమిక పోషించారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఆంజనేయస్వామి ఆలయ పునః నిర్మాణంలో కోశాధికారిగా పనిచేశారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించాలి

రైల్వేకోడూరు, జూలై 23: ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సి.బాలసుబ్రహ్మణ్యం, హరిలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని షిర్డీసాయి జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు తీసివేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలతో పాటు పాఠ్య పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవదీప్, లోకేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో మెరుగైన సేవలందించాలి

సుండుపల్లె, జూలై 23: అంగన్వాడీల్లో మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ పీడీ శశికళ తెలిపారు. మంగళవారం మండలంలోని కమ్మగుట్టపల్లి, పెద్దమాదిగపల్లె, దిగువమాలపల్లె, యానాదికాలనీతో పాటు అంగన్వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. గర్భిణీ, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని పంపిణీ చేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. చిన్నారుల హాజరు రోజు వారి మెనూను సక్రమంగా రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.




అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ శశికళ

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

పుల్లంపేట, జూలై 23: రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పుల్లంపేట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జీవో నంబరు 117ను రద్దు చేసి జీవో నంబరు 55 ను అమలు చేయాలన్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాల నిర్వహించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఎంఈవో చక్రధర్‌రాజుకు అందజేశారు.

నవ్యాంధ్ర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

లక్కిరెడ్డిపల్లె, జూలై 23: నవ్యాంధ్ర బలిజ సంఘం నూతన కార్యావర్గం ఎంపిక మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన బలిజ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా కావలి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, సంఘం సలహాదారునిగా మదన్‌మోహన్, వర్కింగ్ ప్రెసిడెంటుగా వెంకటక్రిష్ణయ్య, కోశాధికారిగా యనమల విశ్వనాథ, గౌరవాధ్యక్షుడిగా కడియాల వెంకట సూర్య ప్రసాదు, ఉపాధ్యక్షులుగా రెడ్డయ్య, భాస్కర్‌రాజు తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఆంజనేయులు, శ్రీకాంత్

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిన్నమండెం, జూలై 23: మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మాండవ్య నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు సంఘటన స్థలానికి విచ్చేసి ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో ఉంచామని ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ రమేశ్‌బాబును వివరణ కోరగా... ఇప్పుడు సమయం లేదని, తర్వాత మాట్లాడుతామంటూ సమాధానం చెప్పారు.



ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకున్న ఎస్ఈబీ అధికారులు

కలెక్టర్‌కు ఫిర్యాదుపై ఆరా

సుండుపల్లె, జూలై 23: మండలంలో మట్టి రవాణా జరుగుతోందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మైనింగ్‌శాఖ ఆర్ఐ, సిబ్బంది మట్టి తవ్విన గుట్టలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారునితో సుండుపల్లె రెవెన్యూ తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ అధికారులు అనుమతులతో అవసరాలు నిమిత్తం తరలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవి, సర్వేయర్ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుట్టను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు: కాంగ్రెస్

రైల్వేకోడూరు, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఉపయోగపడే నిధులు, పరిశ్రమలు తదితర వాటి గురించి పొందుపరచలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేశారన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదాను పక్కన పెట్టారన్నారు. ఇప్పటికైనా హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ మరింత భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు.

పీలేరులో టీడీపీ నేతపై హత్యాయత్నం

● తుపాకులతో కాల్పులకు తెగబడ్డ దుండగులు

పీలేరు, జూలై 23 : పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లు గ్రామానికి చెందిన గిరినాయుడు అనే టీడీపీ నాయకుడిపై గుర్తు తెలియని ఆగంతకులు తుపాకులతో హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి కలకలం రేపింది. ఒంటిల్లుకు చెందిన గిరినాయుడు కావలిపల్లె టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. మంగళవారం గిరినాయుడి కుమారుడు గగన్ సాయి చౌదరి పుట్టినరోజు కావడంతో కేక్ కట్ చేసుకునేందుకు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో సన్నాహాలు చేసుకున్నారు. ఆ సమయంలో ముఖాలకు మంకీ క్యాప్‌లు, చేతులు నల్లని గ్లౌప్స్ ధరించిన నలుగురు ఆగంతకులు ఇంట్లోకి చొరబడ్డారు. ఈ పెనుగులాటలో ఆగంతకుడి చేతిలో ఉన్న తుపాకీ కిందపడిపోయింది. ఇంతలో ఇంటిలోపలి నుంచి గట్టిగా అరుపులు వినపడటంతో ఇంటిపక్కనే ఉన్న గిరినాయుడి తండ్రి నారాయణ ఇంటిలోపలికి వచ్చి తన బిడ్డను ఏమీ చేయవద్దని వారిని ప్రాథేయపడ్డాడు. తండ్రి రాకతో ధైర్యం తెచ్చుకున్న గిరినాయుడు తిరగబడటంతో ఆగంతకులు వెనకడుగు వేసి ఇంటి బయటకు వచ్చేశారు. దీంతో గిరినాయుడు వారిని వెంబడిస్తూ రోడ్డు వరకు తరిమాడు. అయితే అప్పటికే సిద్ధం చేసుకున్న స్కూటర్‌లలో దాదాపు పది మంది పారిపోయారని గిరినాయుడు తెలిపారు. ఈ విషయం ఒంటిల్లు గ్రామంలో దావానలంతా వ్యాపించడంతో గిరినాయుడు ఇంటివద్ద గుమికూడారు. విషయం పోలీసులకు తెలియడంతో పీలేరు ఎస్ఐ రమణ, ఏఎస్ఐ హేమసుందర్‌లు గిరినాయుడు ఇంటికి చేరుకుని జరిగిన సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


మనోజ్ కుమార్ (ఫైల్ ఫొటో)

కలికిరి, జూలై 23: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. కలికిరి హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ అలీ కథనం మేరకు మండలంలోని గుట్టపాళెం కస్బాకు చెందిన భాస్కర కుమారుడు మనోజ్ కుమార్ కలికిరిలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో మనోజ్ కుమార్ గుట్టపాళెం నుంచి జంగంపల్లె మార్గంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న జంగంపల్లె హరిజనవాడకు చెందిన వెంకటరమణ ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మనోజ్ కుమార్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వెంకటరమణకు గాయాలు కావడంతో అతను కలికిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మదనపల్లె అర్బన్, జూలై 23: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ములకలచెరువు మండలం, గూడుపల్లె పంచాయతీ, కనుగొండ వారిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడిన ఆయనను చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబసభ్యులను కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పంటల సాగు కోసం బ్యాంకులో పంట రుణాలు తీసుకుని , ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుని పంటలో నష్టాలు రావడంతో కుటుంబపోషణ కష్టమై అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో డయేరియా నివారణ చర్యలు

మదనపల్లె అర్బన్, జూలై23: మండలంలోని గ్రామపంచాయతీల్లో మంగళవారం డయేరియా రాకుండా కార్యదర్శులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీటీఎం గ్రామంలో డయేరియా ప్రబలకుండా స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు పంచాయతీ సెక్రటరీ హరి పేర్కొన్నారు. ఇందులో భాగంగా సీటీఎం పంచాయతీలోని మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం, మురుగు నిల్వలను తొలగించడం, పాడైన పైపులైన్లు మరమ్మతులు పలు గ్రామాల్లో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శులు కొండామర్రిపల్లె రవినాయక్, పోతబోలు షబాద్, వేంపల్లె వెంకటేశ్వర్లు, అంకిశెట్టిపల్లె సంధ్యారాణి, ఈశ్వరమ్మకాలనీ శ్వేతా. రామాచార్లపల్లె మురళి, పెంచుపాడు మనోహర్, కొత్తపల్లె షర్ఫుద్దీన్, పొన్నేటిపాలెం శ్రీహరి, చీకలబైలు రవి, కొత్తవారిపల్లె గిరినాయక్, తట్టివారిపల్లె వెంకటరమణ, కొత్తయిండ్లు ఆనంద్‌బాబు, బొమ్మన చెరువు శ్రీకాంత్, బసినికొండ పద్మావతి, కురువంక బాబామస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

తంబళ్లపల్లె, జూలై 23: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని ఎంపీడీవో క్రిష్ణమూర్తి అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఆగస్టు 5వ తేదీ వరకు పారిశుధ్య పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పంచాలమర్రి గ్రామంలో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ.. పారిశుధ్య పక్షోత్సవాల్లో బాగంగా మురుగునీటి కాలువలు శుభ్రపరచి బ్లీచింగ్ చల్లుట, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయుట, తాగునీటి పైపు లైన్లు మరమ్మతులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దమండ్యం, జూలై 23: ప్రతి ఒక్కరు పరసరాల పరిశుభ్రత పాటించాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణయ్య పిలుపు నిచ్చారు. పెద్దమండ్యంలో మంగళవారం పర్యటించి హోటళ్లు, పానీపూరి, చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తే చర్యలు తప్పవని సెంటర్ నిర్వాహకులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యద ర్శులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఈవోఆర్డీ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీల్లో అధికారులు


బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను సిద్ధం చేస్తున్న రెవెన్యూ అధికారులు

ములకలచెరువు, జూలై 23: ములకలచెరువు తహసీల్దార్ కార్యాయలంలో రికార్డుల పరిశీలన మంగళవారం తెల్లవారుజామున వరకు సాగింది. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రికార్డులు దహనం కావడంతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మదనపల్లె ఘటనలో కుట్ర కోణం బయట పడడంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిధిలోకి వచ్చే ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాంలో రికార్డులుభద్ర పరిచే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాయంలో సోమవారం రాత్రి ఏడు గంటల నుంచి రాయచోటి ఆర్డీవో రంగాస్వామి పర్యవేక్షణలో రాయచోటి తహసీల్దార్ జయన్న రికార్డుల తనిఖీ చేపట్టిన విషయం విదితమే. ఇక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపిన రికార్డులను పరిశీలించారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు రికార్డులు, ఫైళ్ళ ఓసీలను తనిఖీ చేశారు. 22(ఎ) భూ రికార్డులు, భూ వివాదాలకు సంబంధించిన ఆర్‌వోఆర్ రికార్డులు, వ్యవసాయ భూమి నుంచి కన్‌వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న మొత్తం 40 ఫైళ్ళను అధికారులు వెంట తీసుకెళ్లారు. వాటిని కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ అనీల్ కుమార్, డీటీ హరికుమార్, ఆర్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

రికార్డులు సబ్‌కలెక్టర్ ఆఫీసుకు తరలింపు

వాల్మీకిపురం, జూలై 23: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి 22ఎ రికార్డుల విభాగం దహనం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈనేపథ్యంలో వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి 8గంటల నుంచి మంగళవారం ఉదయం 7గంటల దాకా పరిశీలించిన రికార్డులను మొత్తం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. వాల్మీకిపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల భద్రత విషయమై ప్రత్యేక అధికారులను నియమించారు. హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, పీలేరు, గాలివీడు తహసీల్దార్లను వాల్మీకిపురం మండలానికి ప్రత్యేకాధికారులుగా నియామకం చేశారు. కాగా రికార్డుల పరిశీలనలో స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది 01-04-2022 నుంచి మంగళవారం వరకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపిన ప్రతి రికార్డును పరిశీలించి కట్టుదిట్టం చేశారు. 22ఎ, ఇళ్ల స్థలాలు, ఆర్‌టీఏ, అసైన్డ్, వెబ్‌ల్యాండ్, డీకేటీ తదితర రికార్డులు మొత్తం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ఖతిజున్‌కుబ్రా, డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలోని కురబలకోట తహసీల్దార్ కార్యా లయాన్ని పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రికార్డులు కాలిపోలిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తంబళపల్లె నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలకు పోలీసులు వెళ్లి రికార్డుల గదులను పరిశీలించారు. కాగా కురబలకోటలో సీఐ సద్గురుడు తన సిబ్బందితో వెళ్లి రికార్డుల గదిని పరిశీలించి సీసీ కెమెరాలు లేకపోడంతో ప్రశ్నించారు. కార్యాలయంలో కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుని అవసరమైన కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. కాగా 22ఏకి సంబంధించి సోమవారం రాత్రి రాయచోటి ఆర్డీవో రంగస్వామి, తహశీల్ధార్ ఈశ్వరమ్మ, డీటీ నవీన్ తాజ్‌ల ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో ఎన్‌వోసి మంజూరు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సిద్ధం చేసి తహసీల్దార్ మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు అందజేశారు.

భూముల రికార్డులు మరో సెట్ తయారీ

బి.కొత్తకోట, జూలై23: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూములకు సంబంధించిన విలువైన ఫైళ్లు కాలిపోయిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ కార్యాలయానికి వివిధ మండలాలనుంచి పంపించిన చుక్కలభూములు, 22ఏ, ల్యాండ్ కన్వర్షన్, అసైన్‌మెంట్, అలినేషన్ తదితర భూకేటాయింపుల ఫైళ్లను మరో సెట్ చేసి సిద్ధం చేయాలని భావించారు. ఈ క్రమంలో బి.కొత్తకోట మండలానికి ప్రత్యేక అధికారిగా నియమితులైన సబ్‌కలెక్టర్ లీలారాణి సోమవారం రాత్రంతా సిబ్బందితో కలిసి ఫైళ్ల పరిశీలనలో పాల్గొన్నారు. ఆమె ఆదేశాలు,సూచనల మేరకు డీటీ అన్సారీ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది అన్ని రకాల ఫైళ్లను పరిశీలించి, వాటి జిరాక్స్ ప్రతులతో మరో సెట్‌ను తయారు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపిన సుమారు 80 ఫైళ్లను డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్ ఆధారంగా పరిశీలించారు. వీఆర్వోలు, సహాయకులు పాల్గొన్నారు.

ఘటనపై పారదర్శకంగా విచారణ జరపాలి



మదనపల్లె కదిరిరోడ్డులో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


పీలేరు సమావేశంలో మాట్లాడుతున్న ధరణీ కుమార్

మదనపల్లె అర్బన్, జూలై 23: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దహనమైన భూ రికార్డుల సంఘటనపై సమగ్రంగా పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కదిరి రోడ్డులో సీపీఎం నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దహనమైన భూ రికార్డుల సంఘటనపై వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలని కోరారు. కీలకమైన 22ఏ విభాగం, తపాలా విభాగం, ఏవో క్యాబిన్‌లో ఉన్న ఫైలు, డేటా కాలి బూడిదయ్యాయని ఇది కావాలనే డాక్యుమెంట్లు తగల పెట్టారని ఆయన ఆరోపించారు. కార్యాలయంలో రాత్రి 11 గంటల వరకు ఉండడం ముఖ్యమైన ఫైళ్లు తగలపడిపోవడంతో అనుమానాలకు తావు ఇస్తోందన్నారు. రాష్ట్ర డీజీపీ, సీఐడీ చీఫ్ హటాహుటిన మదనపల్లెకు వచ్చినా సమగ్ర వివరాలు ఏమి తేల్చకపోవడం విచారకరమన్నారు. ఇందులో ఎలాంటి వారి ప్రమేయం ఉన్నా వదిలి పెట్టరాదని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్, రమణ, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఘటనపై సీబీసీ విచారణ జరిపించాలి

పీలేరు, జూలై 23: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతకు మునుపు సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రికార్డులు కాలిపోయాయా? లేక ఎవరైనా కాల్చి వేశారా? అన్న విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. గడిచిన ఐదేళ్లలో తాము సాగించిన అక్రమ భూదందాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే వైసీపీ నాయకులు రికార్డులు దహనం చేశారని, ఆ ఘటన వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించరాదన్నారు. అంతే కాకుండా జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలకు భద్రత పెంచాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు జెట్టి మల్లిఖార్జున, గట్టప్ప, తుమ్మల చంద్ర, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

● డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు


రంగసముద్రంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెద్దతిప్పసముద్రం జూలై 23 : పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు వెల్లడించారు. మంగళవారం ఆయన మండలంలోని సంపతికోట గ్రామంలోని కానుగమాకులపల్లెలో పర్యటించారు. పంచాయతీ అధికారులతో కలిసి ఆయన గ్రామంలో ఉన్న చెత్తదిబ్బలను తక్షణం తొలగించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, గ్రామాల్లో ఉన్న మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను వారానికి ఒక రోజు శుభ్రం చేసే విధంగా పంచాయతీ కార్మికులను ఆదేశించారు. అనంతరం ఆయన రంగసముద్రంలో పర్యటించి పంచాయతీలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్మికులు మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సంపతికోట సర్పంచ్ ఎం. చిన్నరెడ్డెప్ప, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, దేవప్పకోట సర్పంచ్ సురేష్‌తో పాటు రంగసముద్రం సర్పంచ్ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రంగసముద్రం శివప్రసాద్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులో 31 మందికి అప్‌డేట్

పెద్దమండ్యం, జూలై 23: పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంపులో 31 మందికి ఆధార్ వివరాల అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ ప్రత్యేక క్యాంపు ద్వార పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని కలిచెర్ల జూనియర్ కాలేజీలో 24వ తేదీ ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 25న కలిచెర్ల పాతూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాల, 26న కలిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాల, 27న కోటకాడపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. 7 సంవత్సరాలు వయసు కలిగిన చిన్నారులకు మాత్రమే ఆధార్ క్యాంపులో ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. హెచ్ఎం బాబు, పెద్దమడ్యం, పాపేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులు పెనుగొండ జగన్, జనార్ధన, నాగేశ్వర పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి

వాల్మీకిపురం, జూలై 23: లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, పాఠశాల హెచ్ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో రూ.48వేలు రికవరీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీయే పీడీ సత్యనారాయణ

బి.కొత్తకోట, జూలై23: బి.కొత్తకోట మండలంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పనులలో రూ.48556 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. సామాజికతనిఖీ బృందం 1ఏప్రిల్ 2023 నుంచి, 31మార్చి 2024 వరకు మండలంలో జరిగిన ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూయస్ శాఖలలో చేసిన 1207పనులపై తనిఖీలు జరిపారు. ఈ పనులచెల్లింపులలో మస్టర్ల తేడాలకు సంబంధించి రూ.38716, గణాంకాల తేడాలలో రూ.1840, పొరపాట్లు చేసినందుకుగాను 5గురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ముగ్గురు టీఏలకు అపరాధం రూ.8 వేలు కలిపి రూ.48556 మాత్రమే రికవరీ కావాల్సివున్నట్లు ప్రకటించారు. కాగా ఈ తనిఖీలు చేపట్టేందుకు సామాజిక తనిఖీ బృంధానికి ప్రభుత్వ వ్యయం రూ.1.15లక్షలు కావడం విశేషం. అదేవిధంగా పించన్ల పంపిణీలో భర్త ఉండగానే వితంతువులుగా, చెవులు వినిపిస్తున్నా బధిరులుగా, వయస్సు తేడా వున్న 15 మంది పింఛనుదారులు అక్రమంగా పింఛను పొందుతున్నట్లు తేల్చారు. వారిపై నివేదిక ఇవ్వాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారా యణ, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఏపీడీ మధుబాబు, యమ్పీడీవో నూర్జహన్, యంపీపీ లక్ష్మీనరసమ్మ, ఏపీవో మంజుల పాల్గొన్నారు.

పాలపై వుండే శ్రద్ధ పాడిఆవులపై ఉండాలి

నిమ్మనపల్లి, జూలై 23: పాడిరైతుకు పాలపై ఉండే శ్రద్ధ పాడి ఆవులపై కూడా ఉండాలని మదనపల్లి ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు రోషిని పేర్కొన్నారు. మంగళవారం కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లిలో పాడి రైతులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపట్టి పాడి ఆవులకు టీకాలు వేశారు. అనంతరం 149 పాడి ఆవులకు టీకాలు వేసి బూటాక్స్ పిచికారి చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలు సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, జూలై 23: ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా ప్రాముఖ్యత తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకిపురం పట్టణంలోని జాతీయ రహదారి పనులలో ఉన్న క్యాంపు సిబ్బందికి బీసీజీ టీకాలు వేసి అవగాహన కల్పించారు. అలాగే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా గ్రిల్ సంస్థ క్యాంపు 28 మండలంలోని గండబోయనపల్లె శిబిరంలో ఉన్న సిబ్బందికి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో రహదారి పనులు చేస్తున్న సిబ్బందికి, గ్రిల్ కార్యాలయ సిబ్బందికి టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో చింతపర్తి పీహెచ్‌సీ వైద్యులు జులేఖాబేగం, శ్రీవిద్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న జడ్పీ సీఈవో గ్లోరియా

ములకలచెరువు, జూలై 23: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో గ్లోరియా ఆదేశించారు. మండలంలోని బురకాయలకోట గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగునకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో పోలప్ప, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, ఏవో గౌస్‌బాషా, సీనియర్ సహాయకులు ఈశ్వర్, జూనియర్ సహాయకులు సతీష్, సిబ్బంది రవి, ఖయుమ్ తదితరులు పాల్గొన్నారు.

'చుడా' ఆమోదం లేని లే-ఔట్ల అప్రూవల్స్ నిలిపివేత

పీలేరు, జూలై 23: చిత్తూరు అర్బన్ అభివృద్ధి అథారిటీ(చుడా) ఆమోదం లేని లే-ఔట్లలో వేసిన ప్లాట్లకు పంచాయతీలో ఇంటి ప్లాన్ అప్రూవల్ చేయడం మానివేస్తున్నట్లు పీలేరు పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ తెలిపారు. పీలేరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము ఫైనల్ లే-ఔట్ ప్లాన్ ఆమోదించని లే-ఔట్లు, వాటి సర్వే నెంబర్లను ఇటీవల తమ కార్యాలయానికి చుడా అందజేసిందని, ఆయా సర్వే నెంబర్లలోని ఇళ్లకు ప్లాన్ అప్రూవల్ చేయబోమని ఆయన స్పష్టం చేశారు. 'చుడా' తమకు అందించిన సర్వే నెంబర్లను కార్యాలయంలోని నోటీసు బోర్డులో బహిర్గతం చేశామని, కొత్తగా ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం వచ్చే వారు నోటీసు బోర్డులోని సర్వే నెంబర్లతో వారి సర్వే నెంబర్లు సరిపోల్చుకోవాలన్నారు. అదే విధంగా పట్టణ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, అక్రమ తాగునీటి కొళాయిలు గుర్తించేందుకు బుధవారం నుంచి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆ ఐదు బృందాల సభ్యులు వచ్చే వారం రోజులపాటు పర్యటించి పంచాయతీలో ప్లాన్ అప్రూవల్ లేని ఇళ్లు, అక్రమ నీటి కొళాయిలను గుర్తిస్తాయన్నారు. బృందాలు గుర్తించిన వాటికి ఆలస్య రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆలోపు ప్రజలే స్వచ్ఛందంగా వారి భవనాలు, కొళాయిలకు పంచాయతీకి చెల్లించాల్సిన రుసుములు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా పంచాయతీలో పేరుకుపోయిన ఇంటి, నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేశామన్నారు. త్వరలో రానున్న వినాయక చవితి పండుగ నేపథ్యంలో పట్టణంలో పీవోపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలపై నిషేధించామని, ప్రజలు మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

పీలేరులో ప్రారంభమైన కుక్కల పట్టివేత


పీలేరులో పట్టుకున్న కుక్కలు

పీలేరు, జూలై 23: పీలేరు పట్టణ వాసులను వేధిస్తున్న కుక్కల బెడద త్వరలో తప్పనుంది. ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన వాటిని బంధించేందుకు మంగళవారం నుంచి గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన షికారీలు రంగంలోకి దిగారు. పీలేరులో పెరిగిపోయిన కుక్కల సంచారంపై సోమవారం ఆంధ్రజ్యోతి 'కుక్కలు బాబోయ్' అన్న శీర్షికన కథనం వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. కుక్కల బెడదపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, తిరుపతిలోని షికారీలను సంప్రదించి మంగళవారం నుంచి వారిని పనిలోకి దించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఒక్కరోజునే వారు 40 కుక్కలను బంధించారు. మరో వారం రోజులపాటు వాటిని బంధించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యదర్శి వెల్లడించారు. గతంలో ఒక్కో కుక్కను పట్టినందుకు షికారీలకు రూ.450లు చెల్లించేవారని, ప్రస్తుతం దానిని రూ.230లకు కుదించామని ఆయన తెలిపారు.

పారామెడికల్ కోర్సులకు ఆగస్టు 5 దాకా గడువు

మదనపల్లె టౌన్, జూలై 23: పారా మెడికల్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఆగస్టు 5వ తేదీ వరకు గడువు ఇస్తూ ఏపీ అల్లాయిడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్‌జీఆర్ పారామెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్నారు. ఈ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులకు సెప్టెంబరు 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ అవకాశాన్ని పారా మెడికల్ కోర్సులు చేయగోరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

మాలేపాడులో కొత్తభవనాలనే కొనసాగించాలి


సచివాలయం వద్ద పశువులు తోలుకెళ్లి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మదనపల్లె టౌన్, జూలై 23: మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ దేవళంపల్లెలో నిర్మించిన కొత్త సచివాలయ భవనాల్లోనే పాలన నిర్వహించాలని 10గ్రామాలకు చెందిన ప్రజలు కోరారు. ఆమేరకు మంగళవారం దేవళంపల్లెలో నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ భవనాల వద్దకు ఆవులను తోలుకొచ్చి గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త సచివాలయ భవనాలు దేవళంపల్లె, కత్తివారిపల్లె, పచ్చిపాలపల్లె, ఎగువ దొనబైలు, దిగువ దొనబైలు, బొంతలవూరు, గురుమాన్యం, కృష్ణాపురం, మద్దిగుండ్లపల్లె, ఆవులపల్లె గ్రామాలకు దగ్గరగా ఉన్నాయన్నారు. కాని కొంత మంది రాజకీయం చేసి దేవళంపల్లెలో ఉన్న సచివాలయాన్ని మాలేపాడు గ్రామానికి తరలించి అక్కడ పాత స్కూలు భవనాల్లో నిర్వహించడం తమకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇరుకు భవనాల్లో సచివాలయం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు, స్పందించి కొత్త భవనాల్లోనే సచివాలయం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు శంకర, రామచంద్ర, వెంకటరమణ, ఎస్.చంద్ర, శోభ, నరసమ్మ, చెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించడం శుభపరిణామం

కురబలకోట, జూలై 23: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించడం శుభపరిణామమని టీడీపీ నేతలు బాలకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్ళులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి నిర్మాణానికి రూ15వేల కోట్లు కేటాయించడంపై టీడీపీ, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల జీవనాడి పోలవరం త్వరితగతిన పూర్తవతుందని, దీంతో పంటపొలాలతో సస్యశ్యామలం అవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో ఎంతోవెనకబడ్డామని, తిరిగి పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా ఢిల్లీకి వెళ్లి ఏ ముఖం పెట్టుకుని అక్కడ ధర్నా చేస్తున్నావని వారు ప్రశ్నించారు. సొంత చిన్నాన్న వివేకానందరెడ్డిని అతి కిరాతకంగా హత్య చేసి 5సంవత్సరాలు కావస్తున్న ఇంత వరకు ధర్నా చేయలేదన్నారు. నిజంగా ఆయనపై ప్రేమ ఉంటే పులివెందులలో ధర్నా చేసి నీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, రాజారెడ్డి, వెంకటేష్, ఆనంద్, నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి 15వేల కోట్లు ప్రకటించడం హర్షణీయం

నిమ్మనపల్లి, జూలై 23: రాష్ట్ర రాజధాని అయిన అమరావతికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని టీడీపీ బీసీ సాధికారత జిల్లా కన్వీనర్ లక్ష్మన్న పేర్కొన్నారు. మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర అభివృద్ధికి నాటి నాయకులు తీసుకురాలేదన్నారు. మంగళవారం ఢిల్లీ పార్లమెంట్‌లో ఆర్థిక శాఖా మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టగా అందులో ఏపీలోని అమరావతి, పోలవరం, కొన్ని నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ప్రకటన చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. దీంతో రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

మదనపల్లె అర్బన్, జూలై 23: కేంద్రం ప్రవేశపెట్టి బడ్జెట్ ఉద్యోగస్తులను, ఉపాధ్యాయులను నిరాశ పరిచిందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఆదాయ పన్ను మినహాయింపు రూ. 2.5 లక్షలకే పరిమితం అయిందన్నారు. ఒక వైపు ఎనిమిది లక్షలకు లోపు ఉన్న వారిని వెనుకబడిన వారిగానే లెక్కిస్తూ మరోవైపు రూ. 2.5 లక్షలు ఆదాయం మించిన వారి నుంచి ఆదాయపన్ను వసూలు చేయడం వారిని నిరాశపర్చిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్రం అనాలోచితంగా విద్యారంగానికి బడ్జెట్ కేటాయించిందన్నారు.

రెవెన్యూ రికార్డు గదికి పోలీసు భద్రత

● కలెక్టరు ఆదేశాలతో పుంగనూరులో తక్షణం ఏర్పాటు
● సీసీ కెమోరాలతో నిఘా ● డీఎస్పీ, తహసీల్దారు తనిఖీ


గార్డు విధులు నిర్వహిస్తున్న ఏఆర్ పోలీసులు

పుంగనూరు, జూలై 23: పుంగనూరు రెవెన్యూ రికార్డుల భద్రతపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆరా తీశారు. రికార్డుల గది భద్రతకు పోలీసు గార్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శివయ్యను ఆదేశించారు. 'పుంగనూరులో భద్రమేనా?, కార్యాలయం ఒకచోట-రెవెన్యూ రికార్డుల గది మరోచోట, భద్రతలేనిచోట విలువైన డాక్యుమెంట్లు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. నివేదిక అందించాలని ఆదేశించారు. పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, పుంగనూరు తహసీల్దార్ శివయ్య, సీఐ జయరామయ్య, తదితర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలీసు, రెవెన్యూ అధికారులు రాతిమసీదు వీధిలోని పాత తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుగది, గది ముందు, వెనుక ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ శివయ్య రిపోర్టు మేరకు రికార్డు గది భద్రతకు మంగళవారం రాత్రి నుంచి ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లను 24గంటల పాటు గార్డు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. గది వెనుక భద్రతలేని కిటికీలు, తలుపు తొలగించి వాటి స్థానంలో పటిష్ఠంగా గోడ నిర్మించే పనులు బుధవారం చేపట్టడానికి ఏర్పాట్లు చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌సేఫ్టీ సిలిండర్ పరికరాలు, రికార్డుగదికి చుట్టూ పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. రికార్డు గదిలోపల అధికారులు పరిశీలించి రికార్డులు అన్నీ ఉన్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలోని కొన్ని ముఖ్యమైన రికార్డులను చిత్తూరు కలెక్టరేట్‌కు తరలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భద్రతపై సీసీ కెమెరాలు తదితర అంశాలపై చర్చించి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో సీఐ జయరామయ్య, పుంగనూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వసీం, సీనియర్ అసిస్టెంట్ శివకుమారి, వీఆర్వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పుంగనూరు నియోజకవర్గంలోని రాగానపల్లె 982 ఎకరాల భూమి, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులు, పుంగనూరు బైపాస్‌రోడ్డు భూసేకరణ, అనేక అసైన్డ్ భూముల విషయంలో గత ప్రభుత్వంలో పెద్దలు అవకతవకలకు పాల్పడటంతో విలువైన రికార్డులు ఎక్కడ మదనపల్లె తరహాలో కాలిపోతాయోనంటూ స్థానికంగా చర్చ సాగడం గమనార్హం.


రికార్డు గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివయ్య, డీఎస్పీ విష్ణురఘువీర్

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై ఆరా

● జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు బిజీబిజీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23: జిల్లాలో డీకేటీ భూముల రిజిస్ట్రేషన్లపై అధికారులు దృష్టి సారించారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లావాదేవీల వివరాలను సేకరిస్తున్నారు. ఈ భూముల యాజమాన్యం హక్కులు లబ్ధిదారులకు కల్పిస్తూ గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చట్టం ముసుగులో ఆ పార్టీ నాయకులు అక్రమాలకు తెరలేపారు. ముఖ్యంగా మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు తప్పుడు డాక్యుమెంట్లతో వందల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారనే కుట్ర బహిర్గతమవ్వడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలో జిల్లాలో 13 సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. బికొత్తకోట, బంగారుపాళ్యం, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు (ఆర్వో), చిత్తూరు రూరల్, కలికిరి, కుప్పం, మదనపల్లి, పలమనేరు, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి, వాయల్పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2019 నుంచి 2024 వరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను మంగళవారం ఉదయం నుంచి పొద్దుపోయేదాకా జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సేకరించడంలో నిమగ్నమయ్యారు. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూములు, చుక్కల భూములపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవోతో జిల్లాలోని వైసీపీ నాయకులు భూములను కారుచౌకగా కొట్టేశారు. అసైన్డ్ భూములను 22ఏ నుంచి తీసేయించి ఫ్రీ హోల్డ్ పట్టాలు పొందారు. వాటికి రిజిస్ట్రేషన్లు చేయించారు. జిల్లావ్యాప్తంగా ఇవి ఎన్ని జరిగాయంటూ రెండు ప్రొఫార్మాల ద్వారా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఆరా తీస్తున్నారు. ఈనెల 25న మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియా అధ్యక్షతన సమీక్షా సమావేశంలో ఈ వివరాలను సమీక్షించనున్నట్లు సమాచారం. సమావేశానికి 14 మంది సబ్‌రిజిస్ట్రార్లు హాజరు కానున్నట్లు తెలిసింది.

ఆగమేఘాలపై దేవదాయ రికార్డుల పరిశీలన

చిత్తూరు కల్చరల్, జూలై 23: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల కాల్చివేత నేపథ్యంలో దేవదాయశాఖ అప్రమత్తమైంది. ఆ శాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం రాత్రి అసిస్టెంట్ కమిషనరు ప్రసన్నలక్ష్మి తన సిబ్బందితో సమావేశమయ్యారు. విధులు ముగించుకుని వెళ్లిన సిబ్బందిని వెనక్కు రప్పించారు. అసైన్డ్ భూముల రికార్డులను వీరు పరిశీలించారు. బుధవారం సీఐడీ అధికారులు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. కాగా, రాగానిపల్లె అసైన్డ్ భూముల రికార్డులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె భాగమైనందున ఆ ప్రాంతంలోని దేవదాయ భూములు జిల్లా ఏసీ కార్యాలయ పరిధిలోకి వస్తాయి. వీటన్నిటి దృష్ట్యా అసిస్టెంట్ కమిషనరు రికార్డులను పరిశీలించారు.

తహసీల్దార్ల రిలీవింగ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23: పొరుగు జిల్లాల నుంచి వచ్చిన మండల తహసీల్దార్ల రిలీవింగ్ వ్యవధి మంగళవారం నుంచి గురువారానికి పొడిగించారు. ఫిబ్రవరి 1న జోన్-4 పరిధిలోని మూడు జిల్లాల నుంచి వచ్చిన 31 మంది తహసీల్దార్లకు మంగళవారం వారి సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఆర్డర్లు ఇచ్చారు. ఆ తర్వాత రిలీవింగ్ గడువును కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారానికి మార్పు చేశారు. కౌలుదారులకు రుణకార్డులు, రేషన్‌కార్డుల పంపిణీ వివరాల పునఃపరిశీలన చేయాలని సూచించారు. ఐదు నెలలుగా పెండింగ్‌లోని సుమారు 2500 కులధ్రువీకరణ పత్రాలను సుమోటోగా క్షేత్రస్థాయిలో వెళ్లి వారి అర్హత పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ సూచించారు.

కాఫీలో మత్తుమందిచ్చి చైన్ స్నాచింగ్

చిత్తూరు, జూలై 23: మాయమాటల్లో దింపి, మత్తు మందు కలిపిన కాఫీ ఇచ్చి మహిళ బంగారు చైన్ దొంగలించుకెళ్లిన వైనమిది. ఒకటవ పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు...పాలసముద్రం మండలం ఆముదాలకు చెందిన సరస్వతమ్మ(55) సోమవారం మధ్యాహ్నం బంధువుల ఇంటికి వెళ్లడానికి చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెను మాటల్లో దింపాడు. అనంతరం ఆమెకు కాఫీ తీసుకుని అందులో మత్తు మందు కలిపి ఇచ్చాడు. కాఫీ తాగిన కొద్ది క్షణాల్లోనే ఆమె మత్తులోకి జారుకుంది. వెంటనే దొంగ ఆమె మెడలోని 24గ్రాముల బంగారు చైన్‌ను తీసుకెళ్లిపోయాడు. గంట తరువాత ఆమె మేలుకుని చూస్తే మెడలోని చైన్ కనపడలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాయలచెరువు వంకను అమ్మేస్తున్నారు

వైసీపీ నేత దుశ్చర్య ● ఆక్రమణను పట్టించుకోని అధికారులు ● భారీ వర్షాలొస్తే వరద ముప్పు తప్పదు

పుంగనూరు, జూలై 23: పుంగనూరులో విలువైన రాయలచెరువు వంకను ప్రముఖ వైసీపీ నేత పూడ్చేసి.. ఆక్రమిస్తున్నారు. కుంట స్థలం రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు అమ్ముతున్నారు. పుంగనూరు రాయలచెరువు నిండితే స్కావెంజర్ కాలనీ, కొత్తఇండ్లు హైస్కూల్, మోర్ వెనుక, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా , చౌడేపల్లె రోడ్డు, చెంగళాపురం వంకల నుంచి కౌండిన్యనదిలో కలిసి చదళ్ల చెరువుకు వరదనీరు ప్రవహిస్తాయి. వంకమధ్యలో పూర్వం పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. చెక్‌డ్యామ్‌లు, కాజ్‌వేలు వెడల్పుతో ఉండగా విలువైన ప్రాంతాల్లో వంకలను రాజకీయ అండతో కొందరు ఆక్రమించారు. వాటిని గతంలో కొందరు అధికారుల ద్వారా రికార్డులు మార్చుకుని హక్కుదారులుగా చెలామణి అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. మదనపల్లె రోడ్డు, చౌడేపల్లె రోడ్డులోని కాజ్‌వే వద్ద వంకను కొంతకాలం కిందట ఆటో స్టాండ్‌కోసం మట్టితోలి చదును చేశారు. అలాగే వైసీపీ నేత స్థలాల విక్రయాలతో రోజురోజుకు వంక ఆక్రమణలతో కాలువగా మారుతోంది. తమవద్ద భూమికి సంబంధించి రికార్డులు ఉన్నాయని, అందుకే విక్రయిస్తున్నట్లు ఆ నాయకుడు దర్జాగా చెబుతున్నారు. రాయలచెరువు మొరవ నుంచి చెంగళాపురం సమీపం వరకు ధరలు చుక్కలు తాకుతుండగా వంకను స్థలాలుగా ఆక్రమించి వైసీపీ నేతలు పలుచోట్ల నిర్మాణాలు చేశారు. గతంలో పుంగనూరులో రెండు పర్యాయాలు భారీ వర్షాలు కారణంగా వరద నీరు పారడానికి వంకలు ఆక్రమణలకు గురవడంతో వరదలు వచ్చి భారీ నష్టాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణలను అడ్డుకునే ధైర్యం అధికారులకు లేకపోవడంతో నేతలు ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి వంక ఆక్రమణలు తొలగించడానికి సర్వే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆక్రమణలకు గురైన రాయలచెరువు వంక

వైసీపీ నేత నుంచి వంకను కాపాడండి


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

రాయలచెరువు మొరవనీరు వెళ్లే వంక ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకుని వంకను కాపాడాలని పుంగనూరు తహసీల్దార్ శివయ్యకు మంగళవారం బీజేపీ, టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బీజేపీ మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పట్టణంలోని రాయలచెరువు మొరవ కాలువ సర్వే నెంబర్ 134ను ఖాతా నెంబర్479గా వైసీపీ నాయకులు ఆక్రమించి విక్రయాలు చేశారని, అధికారులు పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దోబీకాలనీలో ప్రవహించే వంకను పూర్తిగా కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. కాల్వ అధికభాగం ఆక్రమణ కావడంతో వర్షాలు అధికంగా కురిస్తే ఇళ్లలోకి నీరు చేరి ప్రమాదం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బీజేపీ నేత బి. నరసింహులు, టీడీపీ నాయకులు సద్దాంహూస్సేన్, నదీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటా

● ముఖాముఖిలో భువనేశ్వరి హామీ


కోటపల్లె సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

గుడుపల్లె, జూలై 23: గుడుపల్లె మండలంలో మంగళవారం నారా భువనేశ్వరి పర్యటించారు. కమ్మగుట్లపల్లె, కంచిబందార్లపల్లె, కోటపల్లె, గుత్తార్లపల్లె గ్రామాలలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు తమ సమస్యలను ఆమెకు విన్నవించుకున్నారు. తమ పొలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడంపై అధికారుల వద్దకెళ్లినా న్యాయం జరగలేదని కమ్మగుట్లపల్లెకు చెందిన లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తంచేశారు. 'మీదగ్గర ఉన్న ఆధారాలు నాకు ఇవ్వండి. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తా. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పాలనలో పేదల భూములు కబ్జాకు గురయ్యాయి. ఇలాంటి వారందరికీ ప్రత్యేక కోర్టుల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కంకణబద్ధులై ఉన్నారు. ధైర్యంగా ఉండండి, న్యాయం జరుగుతుంది' అంటూ భువనేశ్వరి ఆమెకు భరోసానిచ్చారు. అలాగే, గ్రామాల్లో సమస్యలపై కొందరు ప్రస్తావించగా.. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, అధికారులతో మాట్లాడి ప్రతివొక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు.

వెల్లువెత్తిన అభిమానం



చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా కుప్పం పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరిపై ప్రజలనుంచి అభిమానం వెల్లువెత్తింది. బెంగళూరు నుంచి ఆమె కోలార్, కేజీఎఫ్ మీదుగా కర్ణాటక సరిహద్దు కెంపాపురం చేరుకున్నారు. అక్కడినుంచి ఆంధ్రా సరిహద్దు అయిన సాతు దగ్గర టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పెద్దయెత్తున ఆహ్వానం పలికారు. అక్కడినుంచి కమ్మగుట్లపల్లెకు వచ్చే మార్గంలో ప్రజలు రోడ్డు పక్కన నిలబడి పూలు చల్లి, మంగళ హారతులిచ్చారు. మార్గమధ్యంలో ప్రతి గ్రామం వద్ద ఆపి, మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గుడుపల్లె మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైరు పగిలి.. బస్సు షెల్టర్‌ను ఢీకొని
సిమెంటు లారీ బోల్తా

● బస్తాల నడుమ ఇరుక్కుని మృతిచెందిన డ్రైవరు
● కల్లూరు ఘాట్ రోడ్డులో ప్రమాదం




బస్సు షెల్టర్‌ను ఢీకొని బోల్తా పడిన సిమెంటు లారీ - మృతి చెందిన శివరాఘవన్

కల్లూరు, జూలై 23: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో సిమెంటు లారీ టైరు పగిలింది. అదుపుతప్పి పక్కనున్న బస్సు షెల్టరును ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ శివరాఘవన్ మృతిచెందారు. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లారీ డ్రైవరు శివరాఘవన్‌ది తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై తాలూకా తాండేరి పోస్టు అప్పాపట్టి గ్రామం. నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సిమెంటు లోడుతో కోయంబత్తూరుకు బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం కల్లూరు ఘాట్ రోడ్డు మలుపు కొమ్మిరెడ్డిగారిపల్లి బస్సు షెల్టర్ సమీపానికి చేరుకోగా.. లారీ ముందు టైరు బరస్ట్ అయింది. దీంతో ఒక్కసారిగా లారీ అదుపుతప్పింది. దీనిని డ్రైవర్ అదుపుచేసే క్రమంలో సమీపంలోని బస్సు షెల్టర్‌ను లారీ ఢీకొంది. దీంతో బస్సు షెల్టర్ కూలిపోయింది. లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగు సీటులో ఉన్న డ్రైవరు.. సిమెంటు బస్తాల మధ్యలో ఇరుక్కుపోయారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. లారీ బోల్తా పడటంతో సిమెంటు బస్తాలు పగిలి చెల్లాచెదరుగా పడిపోవడంతో సిమెంటు దుమ్ముతో ఆ ప్రాంతం నిండిపోయింది. సీటులో.. సిమెంటు బస్తాల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. జేసీబీ సాయంతో 2గంటలు శ్రమించి డ్రైవర్ శివరాఘవన్‌ను బయటకు తీయగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీడని గజదాడులు
రాత్రి జాగరణలో పల్లెజనం

పగలే ఏనుగుల మంద సంచారం


పత్రపల్లె వద్ద టమోటాతోటలో ధ్వంసం చేసిన ఏనుగులు

సోమల, జూలై 23: సోమల మండలంలో గజదాడులు ఆగడం లేదు. దీంతో జనం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పంటలు నష్టంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. సోమవారం రాత్రి ఇర్లపల్లె నుంచి ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, కొత్తూరు గ్రామ సమీపంలో రఘుపతి రెడ్డి, కిరణ్‌కు చెందిన మామిడి, టమోటా తోటల్లో స్వైరవిహారం చేశాయి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మల్లేశ్వరస్వామి ఆలయంలో డ్రిప్ పరికరాలను విరిచేశాయి. అలాగే ఇరికిపెంట పంచాయతీలో మరో ఏనుగుల గుంపు టమోటా తోటల్లో సంచరించి ఉప్పలపాటి భానుప్రకాశ్, కృష్ణమనాయుడు, గొల్లపల్లె మణి, మునీశ్వర, కొల్లా నాగేశ్వరరావు, పంటలను ధ్వంసం చేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న టమోటా తోటలను తొక్కివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నెల రోజులుగా పులిచెర్ల, సదుం మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ మండలంలోకి ప్రవేశించడంతో మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా నీలం రకం మామిడికాయలు కోయాల్సి ఉంది. ఈ సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె, ఇర్లపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు. కాగా మంగళవారం పగలే నెలుకూరివారిపల్లె సమీపంలో 5 ఏనుగుల గుంపు సంచరించాయి. స్థానిక సచివాలయాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏనుగుల బారినుంచి పంటలను కాపాడాలని, ఇప్పటికే నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరుచేయాలని కోరారు.

మదనపల్లెలో చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన ఘటనపై మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా అక్కడికి మదనపల్లెకు వెళ్లి ఈ ఘటనపై లోతుగా విచారించారు. ఈ క్రమంలోనే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరయ్యారు. సిసోడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ఇద్దరు కలెక్టర్లకు కీలక విచారణ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇద్దరు కలెక్టర్లు మంగళవారం నుంచే తమకు అప్పగించిన బాధ్యతల్ని అమలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. కాగా, జిల్లాల విభజనకు ముందు పుంగనూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. దీంతో పుంగనూరు నియోజకవర్గ రికార్డులు ఇంకా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఉండే అవకాశాలున్నాయని సమాచారం. గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం అనేక ప్రాంతాల్లో భూఅక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అదే సమయంలో మంగళవారం పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో అధికారుల సోదాల్లో రెండు సంచుల రికార్డులు బయటపడ్డాయి. దీంతో కాలిపోయిన రికార్డులకు, జిల్లాకూ లింకు ఉందా అనే దిశగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.